ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 79
బుధవారం 21 ఆగస్టు 2024 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ / HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## ఐపీఎల్‌తో రూ.5,210 కోట్లు
గతేడాది బీసీసీఐ లాభం ఇది
2022తో పోలిస్తే 116 శాతం పెరుగుదల



.. వివరాలు 7లో

# అధికారం కోల్పోయినా బలుపు తగ్గలేదు
## తెలంగాణ తల్లి విగ్రహాన్ని పదేళ్లలో పెట్టలేదేం?

సచివాలయం ఎదుట ఎందుకు ఏర్పాటు చేయలేదు?
డిసెంబరు 9న సచివాలయంలో మేం పెడతాం
దీనిపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదు
రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తానంటావా?
టచ్ చేసి చూడు.. వీపు చింతపండే
రాజీవ్‌గాంధీ జయంతి సభలో సీఎం రేవంత్
కేటీఆర్‌పై పోలీసులకు ఎంపీ అనిల్ ఫిర్యాదు
తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన



రాష్ట్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ.. సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఆ ప్రదేశంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే.. తాము మళ్లీ అధికారంలోకి వచ్చాక తొలగిస్తామన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు.

హైదరాబాద్ , ఆగస్టు 20 : ఈ విషయంపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. యూపీఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిన డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని తమ ప్రభుత్వమే సచివాలయంలో ఏర్పాటు చేస్తుందనిప్రకటించారు. మంగళవారం

మిగతా 2 లో



# "చీఫ్" మినిస్టర్ గుర్తుంచుకో..

మేం వచ్చాక సచివాలయ పరిసరాల్లో చెత్తను తొలగిస్తాం
మానసిక రుగ్మత నుంచి రేవంత్ కోలుకోవాలి
రుణమాఫీపై రేపు బీఆర్ఎస్ ధర్నాలు: కేటీఆర్

"నామాటలు గుర్తుంచుకో.. చీ(ఫ్)ప్ మినిస్టర్.. మేం అధికారంలోకి వచ్చిన తొలిరోజే బాబాసాహెబ్ అంబేడ్కర్ సచివాలయం పరిసరాల్లోని చెత్తను తొలగిస్తాం" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు.

హైదరాబాద్, ఆగస్టు 20 : సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి రేవంత్ చేసిన వ్యాఖ్యలపై మంగళవారం ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. "నీలాంటి ఢిల్లీ గులాం (బానిస) తెలంగాణ ఆత్మ గౌరవాన్ని అర్థం చేసుకోలేరు. చిన్నపిల్లల ముందు చెత్తమాటలు మాట్లాడిన

మిగతా 2 లో



# రుణమాఫీలో ఆలస్యం సరికాదు

వ్యవసాయ రంగం రాష్ట్రానికి వెన్నముక
ప్రభుత్వ ఆశయం మేరకు బ్యాంకర్లు సహకరించాలి
బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి సూచనలు

రుణాల మాఫీలో వారం ఆలస్యమైనా ఫలితం ఉండదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రజా భవన్‌లో జరిగిన బ్యాంకర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక కామెంట్స్ చేశారు. లెక్కలు కాదు ఆత్మ ఉండాలన్నారు. ఇప్పటి వరకు రూ. 18 వేల కోట్లు బ్యాంకులకు అందించామని.. రైతులకు మాత్రం నేటి వరకు రూ. 7,500 కోట్లు మాత్రమే చేరాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాలను వేగంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు.

హైదరాబాద్,ఆగస్ట్20 : వ్యవసాయ రంగం రాష్ట్రానికి వెన్నెముకగా భావిస్తామన్నారు. రుణమాఫీ, రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం, భారీ మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయిస్తున్నామని భట్టి తెలిపారు. ఉచితంగా 24 గంటల విద్యుత్తును అందిస్తున్నామన్నారు. రెండు లక్షల రుణమాఫీ ద్వారా రైతులను రుణ విముక్తులను చేస్తున్నామని.. ఇది

మిగతా 2 లో

# కవితకు బెయిల్ వచ్చేలా కాంగ్రెస్ యత్నాలు

## అభిషేక్ మను సింఘ్వికి అందుకే రాజ్యసభ పదవి
## కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



లిక్కర్ కేసులో అరెస్టయి జైల్లో ఉన్న కల్వకుంట్ల కవితకు కాంగ్రెస్ పార్టీయే బెయిల్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ యే కవితకు బెయిల్ ఇప్పించేందుకు కోర్టులో వాదనలు వినిపిస్తున్నారని చెప్పారు. అందుకు అనుగుణంగానే అభిషేక్ సింఘ్వీకి తెలంగాణ నుండి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేయించారని తెలిపారు.

హైదరాబాద్,ఆగస్ట్20 :ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ మ్యాచ్ ఫిక్సింగ్ అయ్యారనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. కేసీఆర్ చెబితేనే కాంగ్రెస్ పార్టీలో ఎంపీ సీట్లు, ప్రభత్వంలో మంత్రి పదవులిస్తున్నారని తెలిపారు. ఈ విషయం తెలిసి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కేసీఆర్ ఫాంహౌజ్ కు క్యూ కడుతున్నారని

మిగతా 2 లో





# హైదరాబాద్‌లో కుండపోత వర్షం

చెరువుల్లా రోడ్లు.. కొట్టుకెళ్లిన కార్లు
రాంనగర్‌లో గల్లంతైన వ్యక్తి మృతి
14 చోట్ల 10 - 12.5 సెం.మీ. వర్షం

హైదరాబాద్, సిటీ, ఆగస్టు 20 : రాజధాని హైదరాబాద్‌లో వాన దడ పుట్టించింది. గంటన్నర పాటు కుండపోతతో కంగారు పుట్టించింది. మంగళవారం తెల్లవారుజామున విరుచుకుపడింది. సరూర్‌నగర్‌లో 14.91 బాలానగర్‌లో 14 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. యూసుఫగూడలో

మిగతా 2 లో

# స్కూల్ చిన్నారులపై స్వీపర్ లైంగిక వేధింపులు

అట్టుడికిన మహారాష్ట్ర బద్లాపూర్ గ్రామం
రైలుపట్టాలపై బైఠాయించి ప్రజల ఆందోళన
విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

ముంబై,ఆగస్ట్20 :అభం శుభం తెలియని మూడు, నాలుగేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులపై టాయిలెట్‌లో ఓ స్వీపర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన మహారాష్ట్రను

మిగతా 2 లో



ప్రతి అక్షరం ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
21 ఆగస్టు
2024





# అధికారం కోల్పోయినా బలుపు తగ్గలేదు



**మొదటి పేజీ తరువాయి**

రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సోమాజిగూడలోని ఆయన విగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో 'రాజీవ్ సద్భావన రన్'ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, "ఒకాయన మళ్లీ అధికారంలోకి వస్తే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తానంటున్నడు! ఎవడైనా చేతనైతే వచ్చి విగ్రహం మీద చెయ్యి వేయండి.. వీపు చింతపండు అవుతుంది.

అధికారం పోయినా.. బలుపు తగ్గలేదు. నీ బలుపును కాంగ్రెస్ కార్యకర్తలు అణగదీస్తరు. అక్కడ మీ నాయన విగ్రహం పెట్టాలని దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తీస్తావా? కలలో కూడా నీకు అధికారం రాదు" అని కేటీఆర్‌నుద్దేశించి సీఎం రేవంత్ అన్నారు. కేటీఆర్‌కు ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహం గుర్తుకు వచ్చిందని ఎద్దేవా చేశారు.

**యువతకు స్ఫూర్తి రాజీవ్‌గాంధీ..**

రాజీవ్‌గాంధీ దేశంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన నేత అని, యువతకు స్ఫూర్తి అని సీఎం రేవంత్ అన్నారు. కంప్యూటర్ విప్లవంతో కోట్లాది మందికి ఉపాధి అవకాశాలు వచ్చాయని 19వ దశకంలోనే కంప్యూటర్లు, సాంకేతిక నైపుణ్యాన్ని, టెలికం రంగాన్ని పరిచయం చేసిన స్ఫూర్తిదాత అని కొనియాడారు. రాజీవ్ కుటుంబం దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చి, దేశం కోసం రెండు తరాలు ప్రాణాలర్పించిన కుటుంబమని, రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కుటుంబమని అన్నారు. సచివాలయం ముందు కోట్లాది మందికి స్ఫూర్తిగా అమరవీరుల విగ్రహం పక్కన దేశం కోసం అమరుడైన రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం సమంజసమన్నారు. త్వరలోనే పండుగ వాతావరణంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. "ఉద్యమం ముసుగులో తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకొని, రూ.వేల కోట్లు సంపాదించుకొని, వందలాది ఎకరాల్లో ఫాంహౌస్‌లు కట్టుకున్నవారి విగ్రహం సచివాలయం ముందు పెడతారా?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నాయకులు అధికారం కోల్పోయిన అసహనంతో విచక్షణా రహితంగా మాట్లాడితే తెలంగాణ సమాజం నుంచి బహిష్కరించాల్సి వస్తుందని హెచ్చరించారు. పారిస్ ఒలింపిక్స్‌లో మన దేశం ప్రభావం చూపలేకపోయిందని, దక్షిణ కొరియా లాంటి చిన్న దేశానికి 32 పతకాలు వచ్చాయని సీఎం రేవంత్ అన్నారు. దక్షిణ కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీలాగే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని తెలంగాణలో ప్రారంభిస్తామని తెలిపారు.

**4గోడల మధ్యకూర్చుంటే పెట్టుబడులు రావు**

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. కానీ, ఒకాయన ఇక్కడ కూర్చొని ఏదో కంపెనీతో ఎంవోయూ చేసుకొని వచ్చారంటున్నారని విమర్శించారు. "మీలాగా నాలుగు గోడల మధ్య కూర్చుంటే పెట్టుబడులు రావు. కంపెనీలతో ఎంవోయూలు చేసుకుంటేనే పెట్టుబడులు వస్తాయి. మీకు, మాకు తేడా ఇదే" అని డిప్యూటీ సీఎం అన్నారు. చెరువులు, కుంటల్లో ఆక్రమణలు తొలగించేందుకు హైడ్రాను తీసుకొచ్చి రాష్ట్ర ప్రజలకు కానుకగా ఇచ్చామని తెలిపారు. రూ.31 వేల కోట్లతో రైతు రుణమాఫీ ప్రక్రియను చేపట్టామని పేర్కొన్నారు. పదేళ్లలో రూ.లక్ష రుణమాఫీ చేయనివారు.. పది రోజుల్లో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ చెప్పిన ప్రతీ గ్యారంటీని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేష్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కేటీఆర్‌పై అనిల్‌కుమార్‌యాదవ్ ఫిర్యాదు**

బంజారాహిల్స్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న ముఖ్యమంత్రిని 'చీప్ మినిస్టర్' అని సంబోధిస్తూ 'ఎక్స్'లో కేటీఆర్ పోస్టు చేశారని, అంతేకాకుండా 'ఢిల్లీ గులామ్' అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఈ మేరకు కేటీఆర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సైఫాబాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అనిల్‌కుమార్ యాదవ్ కోరారు.

## సచివాలయం ముందు విగ్రహం పెట్టి తీరుతాం

రాజీవ్ విగ్రహాన్ని టచ్ చేస్తే చర్యలు తప్పవు

ఘాటుగా హెచ్చరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట,ఆగస్టు 20: దేశంలో సాంకేతిక విప్లవం తెచ్చిన మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సెక్రెటేరియట్ ముందు ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవగాహన లేకుండా మాజీ మంత్రి కేటీఆర్ రాజీవ్ విగ్రహాన్ని కూల్చివేస్తామని మాట్లాడడం సరికాదన్నారు. కేటీఆర్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని వార్నింగ్ ఇచ్చారు. దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన వ్యక్తి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని టచ్ చేసే ధైర్యం ఉందా అని అడిగారు. మాజీ సీఎం కేసీఆర్ ట్యూనింగ్ చేస్తే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మ్యూజిక్ ఇస్తున్నారని విమర్శించారు. రెండు పార్టీలు కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే వారికి వారు అవమాన పరచుకున్నట్లేనని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రుణమాఫీపై బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు చేశారు. రుణమాఫీపై రైతులు కంగారు పడొద్దని.. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 2018 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ లోపు రూ.2 లక్షలు రుణాలు పొందిన రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందని స్పష్టం చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం నిర్వహించారు.

## స్కూల్ చిన్నారులపై స్వీపర్ లైంగిక వేధింపులు

**మొదటి పేజీ తరువాయి**

కుదిపేస్తోంది. థానే జిల్లాలోని బద్లాపుర్‌లో ఓ స్కూల్‌లో జరిగిన ఈ అమానవీయ ఘటనను ఖండిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. చిన్నారులపై దుశ్చర్యకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ దాదాపు ఏడు గంటలుగా బద్లాపుర్ రైల్వేస్టేషన్‌లో పట్టాలపై బైఠాయించి రైళ్ల రాకపోకల్ని అడ్డుకొంటున్నారు. రైళ్ల రాకపోకల్ని అడ్డుకోవద్దంటూ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సైతం లెక్క చేయకుండా తమ నిరసనలు కొనసాగిస్తున్నారు. మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ నిరసనకారుల్ని శాంతింపజేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బాధిత బాలికలకు న్యాయం చేయాలని, అరెస్టు చేసిన నిందితుడిని ఉరితీయాల్సిందేనంటూ ఆందోళనకారులు నినదించారు. రైల్వే ట్రాక్‌లను ఖాళీ చేయాలంటూ మంత్రి విజ్ఞప్తి చేసినా.. 'హ్యాంగ్.. హ్యాంగ్' అంటూ నినాదాలతో ఆ పరిసరాలను హోరెత్తించారు. డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు సన్నిహితుడైన మంత్రి గిరీశ్ మహాజన్.. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదుల్ని తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారుల్ని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాం÷–రతి వ్యక్తం చేసిందని.. నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆరు గంటలకు పైగా కొనసాగుతోన్న రైల్ రోకోతో పలు లోకల్ రైళ్లు రద్దవ్వడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నిరసనకారుల డిమాండ్లకనుగుణంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని చెప్పారు. అయినా ఆందోళనకారులు నిరసనల్ని విరమించలేదు. మరోవైపు, ఈ ఘటనపై డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ఇద్దరు చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటనను మహిళా ఐపీఎస్ నేతృత్వంలో విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఐజీ ర్యాంకు కలిగిన ఐపీఎస్ అధికారిణి ఆర్తి సింగ్‌ను దర్యాప్తు అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఈ ఘటనపై వీలైనంత త్వరగా విచారించాలని, ఛార్జిషీట్‌ను దాఖలు చేయాలని, విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ముందు ఈ అంశాన్ని ఉంచాలను కుంటున్నట్లు ఫడణవీస్ తెలిపారు. ఇలాంటి అనాగరిక, అమానవీయ చర్యకు తక్షణమే శిక్ష పడేలా పోలీసులు పూర్తిస్థాయిలో కృషిచేస్తున్నారని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఈ ఘటనను రాజకీయం చేసేందుకు సుప్రియా సూలే, ఉద్ధవ్ ఠాక్రే వంటివారు చూస్తున్నారని దేవేంద్ర ఫడణవీస్ ఆరోపించారు. ఇలాంటి ఘటనలతో రాజకీయ లబ్ధి పొందాలని విపక్షాలు చూడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. విపక్షాలకు ఎలాంటి సానుభూతి లేదన్నారు. ఠాక్రే ఒక రాజనీతిజ్ఞుడిలా ప్రవర్తించాలి తప్ప ఇలాంటి సున్నితమైన అంశాలను రాజకీయం చేయరాదని హితవు పలికారు. ఈ నిరసనలు రాజకీయ ప్రేరేపితమని భాజపా ఎమ్మెల్యే కిషన్ కథోర్ ఆరోపించారు. ఆందోళనకారులంతా బద్లాపుర్ నుంచి కాకుండా పొరుగు ప్రాంతాల నుంచి వచ్చినవారేనని వ్యాఖ్యానించారు. ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించిన పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందిపై సమగ్ర దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## హైదరాబాద్‌లో కుండపోత వర్షం



**మొదటి పేజీ తరువాయి**

12.5, ఉప్పల్‌లో 12.1 సెం.మీ. వాన పడింది. రాజేంద్రనగర్, సరూర్‌నగర్, వెస్ట్‌మారెడ్‌పల్లి, ఎల్‌బీనగర్, గోల్కొండ లంగర్‌హౌస్, న్యూ నాగోల్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్, నాంపల్లి, మల్లాపూర్, ముషీరాబాద్‌లలో పది సెం.మీ. వర్షం పడింది. గ్రేటర్ హైదరాబాద్‌లో 20పైగా ప్రాంతాల్లో 9.5 సెం.మీ., 14 ప్రాంతాల్లో 10 నుంచి 12.5 సెంటీమీటర్ల వర్షం కురిసిందని అధికారులు తెలిపారు. వాన ధాటికి లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. యూసుఫగూడ, ఫిలింనగర్, వెంగళ్‌రావునగర్‌లలో కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి.

పంజాగుట్ట కాలనీ సుఖ్‌నివాస్ అపార్ట్‌మెంట్‌పై పిడుగుపడి షెడ్డుతో పాటు కారు ధ్వంసమయ్యాయి. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం సెల్లార్‌లోని లైబ్రరీలోకి నీరు చేరింది. ముషీరాబాద్ రాంనగర్‌లో వరదలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి చెందాడు. యూసుఫగూడలో బైక్‌పై వెళ్తున్న వాహనదారు, పార్శిగుట్ట చౌరస్తా సమీపంలో కారు కొట్టుకుపోగా డ్రైవర్, ప్రయాణికులను స్థానికులు కాపాడారు.

హైదరాబాద్‌లో భారీ వర్షాలతో యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం కలిగింది. కాగా, యాదగిరిగుట్ట మండలంలో 17.03 సెం.మీ. భారీ వర్షపాతం నమోదైంది.

నారాయణపేట జిల్లా మద్దూరులో 13.6 సెం.మీ., గద్వాల జిల్లా అయిజలో 13.3 సెం.మీ. వానపడింది. రాష్ట్రంలో బుధ, గురువారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

బుధవారం ఉమ్మడి పాలమూరుతో పాటు మేడ్చల్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. రంగారెడ్డి, నల్లగొండ, సిరిసిల్ల, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల్లో కొన్నిచోట్ల, గురువారం నిర్మల్, జగిత్యాల, భూపాలపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

కామారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్, హన్మకొండ, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జలాశయాలు, చిన్న నీటి వనరులను పర్యవేక్షించేందుకు ఇంజనీర్ల బృందం సిద్ధంగా ఉండాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అవసరమైన చోట పాఠశాలలకు సెలవులివ్వాలని చెప్పారు.

## "చీప్" మినిస్టర్ గుర్తుంచుకో..

**మొదటి పేజీ తరువాయి**

రేవంత్ నైజం, వ్యక్తిత్వం ఆయన పెంపకాన్ని సూచిస్తుంది. నీ మానసిక రుగ్మతనుంచి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా" అంటూ సీఎంను ఉద్దేశించి కేటీఆర్ పేర్కొన్నారు.

అదేవిధంగా సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదానికి కారణమైన సంస్థను బ్లాక్ లిస్ట్‌లో చేర్చాలన్న తమ డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోలేదని, అదే సంస్థకు కొడంగల్ లిఫ్ట్‌ఇరిగేషన్ ప్రాజెక్టును అప్పజెప్పాలని చూస్తోందని, దీనివెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

అలాగే.. ఎటువంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్‌ఎస్ తరఫున ధర్నాలు నిర్వహించనున్నట్లు కేటీఆర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 9లోపు రుణమాఫీ చేస్తామన్న రేవంత్‌రెడ్డి ఆ తర్వాత ఆగస్టు 15 అంటూ మాట తప్పారని, ఇప్పుడు అడ్డగోలు ఆంక్షలు పెట్టి 40వ మంది రైతులకు మాఫీ చేయకుండా ఎగ్గొట్టారన్నారు.

లక్షలాది మంది రైతన్నలకు అండగా నిలిచి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే ధర్నా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఒకవైపు సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల వరకు అందరికీ రుణమాఫీ అయ్యిందని చెబుతుంటే.. మరోవైపు మంత్రులు మాత్రం ఇంకా రుణమాఫీ పూర్తికాలేదని చెబుతున్నారన్నారు. రైతుందరికీ రూ.2లక్షలు రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## రుణమాఫీలో ఆలస్యం సరికాదు

**మొదటి పేజీ తరువాయి**

వ్యవసాయం అనుబంధ రంగాలను బలోపేతం చేస్తాయని చెప్పుకొచ్చారు.

వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతాంశంగా పరిగణిస్తుందన్నారు భట్టి విక్రమార్క. ఇన్నోవేటివ్ పాలసీలతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అమెరికా, కొరియా దేశాల్లో పర్యటించి రూ. 36 వేల కోట్ల విలువైన ఎంఓఏలు కుదుర్చుకున్నారని డిప్యూటీ సీఎం వెల్లడించారు. సూక్ష్మ, మధ్యతరహ పరిశ్రమల ద్వారా పెద్ద సంఖ్యలో ఉపాధి కలుగుతుందని.. వారికి విరివిగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని బ్యాంకర్లను కోరారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాలకు లక్ష కోట్లు వడ్డీ లేని రుణాలు రూపంలో ఇవ్వనున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. వారికి సహకరించి పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడాలని బ్యాంకర్లకు సూచించారు భట్టి. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి క్వార్టర్‌లో ప్రాధాన్యతా రంగాల అడ్వాన్సుల విషయంలో వివిధ విభాగాల్లో బ్యాంకులు సానుకూల పనితీరును కనబరిచినందుకు సంతోషిస్తున్నానని అన్నారు. మొదటి క్వార్టర్‌లోనే ప్రాథమిక రంగం కింద బ్యాంకులు ఇప్పటివరకు 40.62? వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా లక్ష్యాన్ని సాధించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రం నగదు నిల్వల నిష్పత్తి మొదటి క్వార్టర్‌లో 127. 29 శాతానికి మెరుగుపడడం మరో ఆసక్తికరమైన అంశం అని అన్నారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అని.. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ ముందంజలో ఉండేలా తమ ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని ఉపముఖ్యమంత్రి చెప్పారు. వరి ఉత్పత్తిలో పెరుగుదల అంశం.. ఎఫ్‌సీఐకి వరిని సరఫరా చేసే రాష్ట్రాల్లో ప్రధాన రాష్ట్రంగా ఎదగడానికి వీలు కల్పిస్తుందన్నారు. రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగుకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. రాబోయే త్రైమాసికంలో నిర్దేశించిన రుణ ప్రణాళికను అధిగమించేందుకు బ్యాంకర్లు కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు భట్టి పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అమెరికా, కొరియా దేశాల్లో పర్యటించి 36 వేల కోట్ల విలువైన ఎంఓఏలు కుదుర్చుకున్నారు. సూక్ష్మ, మధ్యతరహ పరిశ్రమల ద్వారా పెద్ద సంఖ్యలో ఉపాధి కలుగుతుంది. వారికి విరివిగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించండి. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాలకు లక్ష కోట్లు వడ్డీ లేని రుణాలు రూపంలో ఇవ్వనున్నాం. వారికి సహకరించి పారిశ్రామిక అభివృద్ధి చేయండి. 20 24-25 ఆర్థిక సంవత్సరం మొదటి క్వార్టర్ లో ప్రాధాన్యతా రంగాల అడ్వాన్సుల విషయంలో వివిధ విభాగాల్లో బ్యాంకులు సానుకూల పనితీరును కనబరిచినందుకు సంతోషిస్తున్నాను. మొదటి క్వార్టర్ లోనే ప్రాథమిక రంగం కింద బ్యాంకులో ఇప్పటివరకు 40.62శాతం వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా లక్ష్యాన్ని సాధించడం అభినందనీయం. రాష్ట్రం యొక్క నగదు నిల్వలనిష్పత్తి మొదటి క్వార్టర్లో 127. 29 శాతానికి మెరుగుపడడం మరో ఆసక్తికరమైన అంశం. ఇకపోతే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బ్యాంకర్లది కీలకపాత్ర అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతుల ఖాతాల్లో తప్పులు సరిదిద్ది వారికి లబ్ధి చేకూరేలా చేయాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ ఏడాది దేవుడి దయతో వర్షాలు పుష్కలంగా పడుతున్నాయని మంత్రి తుమ్మల అన్నారు. ఈ సంవత్సరం అధిక విస్తీర్ణంలో పంటలు సాగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కష్టకాలంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పథకం కింద రూ.18వేల కోట్లు ఇప్పటికే విడుదల చేసిందని తుమ్మల చెప్పుకొచ్చారు. కొంత మంది రైతులకు ఇంకా మాఫీ కాలేదని, అందుకు రకరకాల కారణాలు ఉన్నాయని చెప్పారు. వాటన్నింటినీ త్వరలోనే పరిష్కరించి రైతులకు తోడుగా నిలవాలని బ్యాంకర్లకు మంత్రి సూచించారు. నగదు జమ కాని రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన పని లేదని మంత్రి చెప్పుకొచ్చారు. గ్రామస్థాయిలో పని చేసే బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లను రైతుల రుణ ఖాతాల్లో తప్పులు సరిదిద్దేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాల్సిందిగా బ్యాంకర్లను మంత్రి తుమ్మల కోరారు. రుణ మాఫీ చేయడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రుణమాఫీ కార్యక్రమాన్ని సంపూర్ణంగా పూర్తి చేయడానికి సహకారం అందించాలని బాధ్యత బ్యాంకర్ల ఉందన్నారు. అంకెలు చదువుకోవడానికి ప్రతి మూడు నెలలకోసారి మీటింగులు, బ్యాంకర్ల సదస్సు నిర్వహించడంలో అర్థం లేదని తుమ్మల పేర్కొన్నారు. రైతులు, పేదలు, నిమ్నవర్గాల ప్రజలకు పథకాల ద్వారా ఆర్థిక ఫలాలు అందేలా చేయడంలో కీలకంగా వ్యవరించాలని మంత్రి తుమ్మల బ్యాంకర్లను కోరారు.

## కవితకు బెయిల్ వచ్చేలా కాంగ్రెస్ యత్నాలు

**మొదటి పేజీ తరువాయి**

వ్యాఖ్యనించారు. మంగళవారం నాడు మహేశ్వరం నియోజకవర్గంలోని రావిరాల గ్రామంలో నిర్వహించిన సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాల్లో బండి సంజయ్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్ర మంత్రి.. రావిరాల సూర్యగిరి ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని.. అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నానని తెలిపారు. ఇదే సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తనదైన శైలిలో కామెంట్స్ చేశారు కేంద్ర మంత్రి బండి సంజయ్. పదేపదే బీజేపీలో బీఆర్ఎస్ విలీనం చేసుకోబోతున్నారంటూ దుష్ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు బండారం బయటపడిందన్నారు. కాంగ్రెస్ నేతలే కేసీఆర్‌తో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీయే లిక్కర్ కేసులో కవితకు బెయిల్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ కవిత బెయిల్ కోసం కోర్టులో వాదిస్తున్నారని కేంద్ర మంత్రి చెప్పారు. అభిషేక్ సింఘ్వీ పెద్ద న్యాయవాది, అనుభవజ్ఞుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. ఆయన తెలంగాణ నుండి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి అవుతున్నాడంటే తెలంగాణ ప్రయోజనాల కోసం కోర్టులో, పార్లమెంట్‌లో గట్టిగా వాదిస్తారని అనుకున్నా. కానీ తీరా చూస్తే.. లిక్కర్ కేసులో అరెస్టై జైల్లో ఉన్న కల్వకుంట్ల కవితకు బెయిల్ ఇవ్వాలని వాదిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ అయ్యాయనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? దీనిపై కాంగ్రెస్ పార్టీ నేతలు సమాధానం చెప్పాలి. ఇన్నాళ్ళు కేసీఆర్ కుటుంబ అవినీతిని బట్టబయలు చేస్తాం.. జైలుకు పంపిస్తామని బీరాలు పలికిన కాంగ్రెస్ నేతలు ఆ కుటుంబాన్ని ఎందుకు జైలుకు పంపలేదు? ఎందుకంటే కాంగ్రెస్‌తో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాయి కాబట్టి. అందుకే కాళేశ్వరం, డ్రగ్స్, మియాపూర్ భూములు, ఫోన్ ట్యాపింగ్ కేసులన్నీ అటకెక్కించారు. రెండు పార్టీలు ఒక్కటే. బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు కల్ల. బీఆర్ఎస్ అవినీతి, కుటుంబ పార్టీ. ఆ పార్టీతో పొత్తు ఉండదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు అవినీతి, కుటుంబ పార్టీలే. కాంగ్రెస్‌లోనే బీఆర్ఎస్ విలీనం తథ్యం.' అని బండి సంజయ్ అన్నారు. అవినీతి కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే పార్టీ బీజేపీ మాత్రమేనని బండి సంజయ్ అన్నారు. ఈ కారణంగానే బీజేపీని దెబ్బతీసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. తాము 6 గ్యారంటీలు, రుణమాఫీపై నిలదీస్తుంటే.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజీవ్ గాంధీ విగ్రహం పేరుతో లొల్లి చేస్తూ చర్చను పక్కదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. సరైన సమయంలో సరైన గుణ పాఠం చెబుతారన్నారు. బీజేపీనే కవితకు బెయిల్ ఇప్పిస్తోందని చెప్పడం దుర్మార్గం అన్నారు. బెయిల్‌కు, బీజేపీకి ఏం సంబంధం అని ప్రశ్నించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
21 ఆగస్టు
2024





# వైద్యురాలి అత్యాచారంపై జెవివి జాతీయ కమిటీ ఖండన



హైదరాబాద్, ఆగస్టు 20 (రోమింగ్ న్యూస్): కోల్కతాలోని ఆర్జికార్ వైద్య కళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జన విజ్ఞాన వేదిక జాతీయ కమిటీ అధ్యకులు స్వరాజ్యలక్ష్మి, జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ నాగరాజ్ గౌడ్ ఉప్పునూతుల, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.వి.ఆర్. కృష్ణాజీలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అత్యాచార బాధితురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, మహిళా డాక్టర్ పై సాముహిక అత్యాచారం, హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని వారు అన్నారు. దేశంలో కుల మతాలుతో గానీ వయసుతో గానీ సంబంధం లేకుండా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు కారణం పురుషాధిక్య భావజాలం అన్నారు. మహిళలపై సమాజం లో ఉండే చిన్న చూపు, వివక్షతను రూపుమాపాలంటె శాస్త్రీయ అవగాహనను విద్యార్థులలో చిన్నప్పటినుంచే పెంచి సమభావాన్ని పంచాల్సిన భాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. వరుసగా జరుగుతున్న అత్యాచారాల విషయంలో మేధావులు, విద్యార్థులు ఏకంగా కదిలి నిరసనలు చేపట్టి అత్యాచారాల నియంత్రణకు పటిష్ట చర్యలు ప్రభుత్వం తీసుకునేంతవరకు పోరాడాలని పిలుపునిచ్చారు . పసిపిల్లలను సైతం కామ దృష్టితో చూస్తూ రోజురోజుకూ అత్యాచారాలు దాడులు చేస్తున్నారని ఇలాగే కొనసాగితే మహిళలు బయటకు అడుగు పెట్టడానికే భయపడతారని వాపోయారు.. మహిళలను వంటింటికే పరిమితం చెయ్యాలనే ఏలిన వారి సిద్ధాంతాలకు ఈ అత్యాచారాలు జీవం పోతున్నాయని దుయ్యబట్టారు. వీటిని ఆపడానికి మహిళా, విద్యార్థి, మేధావి వర్గాలు నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు.

# మండల ప్రత్యేక అధికారులు తనిఖీలు చేపట్టాలి

## కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్




కామారెడ్డి, ఆగస్టు 20 (రోమింగ్ న్యూస్): గవర్నమెంట్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలోని వసతిగృహాలను మండల ప్రత్యేక అధికారులు తనిఖీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో మంగళవారం జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి వసతి గృహాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. పిచ్చి మొక్కలు లేకుండా చూడాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందే విధంగా చూడాలని తెలిపారు. ప్రజావాణి కి వచ్చిన ఫిర్యాదులను శాఖల వారీగా అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వచ్చిన ఫిర్యాదులను ఆన్లైన్లో నమోదు చేయిస్తామని పేర్కొన్నారు. ప్రజావాణి లో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. డిఆర్డిఓ సురేందర్, డిపిఓ శ్రీనివాసరావు, సిపిఓ రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రాఖీ పౌర్ణమి



శ్రీశైలం, ఆగస్టు 20 ( రోమింగ్ న్యూస్ ) శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి సన్నిధిలో శ్రీశైల దేవస్థానం రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ నగళ్లపాటి మల్లికార్జున కు హైదరాబాద్ లో తన సోదరి గీత నాయుడు కాంగ్రెస్ పార్టీ మహిళా డివిజన్ ప్రెసిడెంట్ తన అన్నకు రాఖీ కట్టి, ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించడం అయినది .అలాగే చెల్లెలు కూడా ఎల్లప్పుడూ దీర్ఘ సుమంగళీగా ఉండాలని మరియు ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించడమైనది.

# ఆంజనేయ స్వామి దేవాలయంలో చిరంజీవి యువత తమలపాకుల పూజ



నకిరేకల్ ఆగస్టు 20( రోమింగ్ న్యూస్ ) : పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా మంగళవారం అఖిలభారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో 101 తమలపాకుల పూజ నిర్వహించారు చిరంజీవి యువత జిల్లా కార్యదర్శి దుప్పలపల్లి వెంకన్న నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పగిళ్ల వెంకన్న తో పాటు యువత పాల్గొన్నారు

# లోటస్ ల్యాప్ లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన





దిల్ సుఖ్నగర్, రోమింగ్ న్యూస్: లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్, దిల్సుఖ్నగర్ బ్రాంచ్లో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు లయన్స్ క్లబ్ సభ్యులు నిర్వహించిన వ్యక్తిత్వ వికాసం కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వాన్ని మెరుగుపర్చడానికి మరియు అవసరమైన జీవిత నైపుణ్యాలను వారికి అందించడానికి ఈ కార్యక్రమం ప్రత్యేకంగా రూపొందించబడింది. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, కమ్యూనికేషన్ స్కిల్స్లో మెరుగుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం వంటి అంశాలపై ఉపాధ్యాయులు మరియు లయన్స్ క్లబ్ సభ్యులు పలు ఇంటరాక్టివ్ సెషన్ల ద్వారా పిల్లలను మార్గనిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులను ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు సానుకూల దృక్పథంతో మరియు బాధ్యతాయుతమైన మనస్తత్వంతో సిద్ధం చేయడానికి ఉద్దేశించబడింది. ఛైర్మన్ కొమటి రెడ్డి గోపాల్ ర్డి గారు లయన్స్ క్లబ్ సభ్యులకు విద్యార్థుల వికాసానికి చేసిన విలువైన సహకారం పట్ల కృతజ్ఞతలు తెలిపారు మరియు ఇలాంటి కార్యక్రమాలు యువ మేధావుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఎంతో ముఖ్యమైనవి అని పునరుద్ఘాటించారు. పాఠశాల విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం కేవలం పాఠ్యాంశాలతో మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా సకల విధాలుగా విద్యను అందించడంలో తమ వంతు కృషి చేస్తూ ముందుకుసాగుతోంది. దీనిలో లయన్ డాక్టర్ కి సరే ప్రసాద్, శ్రీనివాస్ మరియు వైస్ ప్రిన్సిపాల్ మాధవి పాల్గొన్నారు.

# లోటస్ లాప్ పబ్లిక్ స్కూల్లో రాఖీ వేడుకలు





హైదరాబాద్, రోమింగ్ న్యూస్: లోటస్ లాప్ పబ్లిక్ స్కూల్స్, దిల్సుఖ్నగర్ బ్రాంచ్లో రాఖీ పండుగను ప్రత్యేకమైన మరియు వినూత్న పద్ధతిలో జరుపుకున్నారు. విద్యార్థుల మధ్య ప్రేమ, కర్తవ్యబద్ధత, సోదరభావం వంటి విలువలను పెంపొందించేలా ఈ కార్యక్రమం రూపొందించబడింది. ఈ కార్యక్రమానికి ఛైర్మన్ కోమటి రెడ్డి గోపాల్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సృజనాత్మకతను ప్రదర్శిస్తూ తమ చేతుల ఆభిరుచితో రాఖీలు తయారుచేశారు. పండుగ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించడంతో పాటు, సాంప్రదాయాలు మరియు నూతన ఆలోచనలను మేళవించేందుకు స్కూలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించింది. రాఖీ పండుగలో ప్రేమ, రక్షణ, గౌరవం వంటి విలువలను బోధించడం స్కూలు ప్రధాన ఉద్దేశంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా మాట్లాడిన ఛైర్మన్ కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి విద్యార్థుల లో సృజనాత్మకత మరియు ఉత్సాహం పట్ల అభినందనలు తెలియజేశారు. "లోటస్ లాప్ స్కూల్స్లో, సంప్రదాయాలను ప్రోత్సహించడంతో పాటు వినూత్న కార్యక్రమాల ద్వారా విద్యార్థులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల మధ్య ప్రేమ మరియు రక్షణ యొక్క బంధం యొక్క ప్రతీకగా, రాఖీలు కట్టుకోవడం మరియు స్వీట్స్ పంచుకోవడంతో ముగిసింది. ఈ ప్రోగ్రాంలో వైస్ ప్రిన్సిపాల్ మాధవి అడ్మిన్ ఆఫీసర్ స్వాతి రెడ్డి అండ్ టీచర్స్ చిల్డ్రన్స్ పాల్గొన్నారు.

# వినతి పత్రం



శ్రీశైలం, ఆగస్టు 20 ( రోమింగ్ న్యూస్ ) శ్రీశైలం పర్యటన సందర్భంగా గిరిజన లకు ఇచ్చిన హామీఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా అటవి శాఖ మార్కాపురం డివిజన్ డీఎఫ్ఓ విగ్నేష్ గారిని మార్కాపురం అటవీశాఖకార్యాలయం నందు గిరిజనుల సమస్యలు, సుగాలి తండాలు అయినా పలు తండా అటవీ ప్రాంతము ల యందు గల ఆవులను అడవిలో మేపుకొనుటకు ఎటువంటి సమస్య లు సృష్టించకుండ గిరిజన తండా వాసులకు ఫారెస్ట్ అధికారులు సంహరించగలరని వినతి పత్రం ఇవ్వడం జరిగింది .

అదేవిదంగా శ్రీశైలం, సుండీపెంట గ్రామాల నుండి ప్రజలు వివిధ పనుల నిమిత్తం విజయవాడ ,కర్నూల్, నంద్యాల, మార్కాపురం, ఒంగోలు ,తిరుపతి, కడప, తదితర ప్రాంతాలలో తమతమా స్వంత వాహనం లో ప్రయాణం చేస్తుంటారు. అటవీ శాఖ అధికారులు ఎక్కడ పడితే అక్కడ చెకపోస్ట్ ఏర్పాట్లు చేసి వాహనదారుల నుండి రుసుము వసూలు చేస్తునందున దయచేసి స్థానికులు నుండి ఎటువంటి వాహన రుసుము వసూలు చేయకుండామినహాయుంపు ఇవ్వగలరని కోరడమైనది . దానికి మార్కాపురం డివిజన్ %ఎటశీ% విగ్నేష్ గారు సానుకూలంగా స్పందించడమైనది .ఈ యొక్క కార్యక్రమం లో బీజేపీ శ్రీశైలం మండలం అధ్యక్షులు మాయాలూరి వెంకటేశ్వర్లు ,బీజేపీ శ్రీశైలం మండలం సెక్రటరీ బోయ మల్లికార్జున, గిరిజన తండా నాయకులు రాములానాయక్, శ్రీను నాయక్ పాల్గొనడం జరిగింది.

# ఆర్.ఓ.ఆర్ యాక్టు పై వర్క్ షాప్ నిర్వహణ



కామారెడ్డి, ఆగస్టు 20 (రోమింగ్ న్యూస్): కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈనెల 23న మధ్యాహ్నం రెండు గంటలకు ఆర్.ఓ.ఆర్ యాక్టు పై వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన 2020 ధరణి చట్టంలో సమస్యలు ఉండటం వల్ల దాని స్థానంలో కొత్త ఆర్ఆర్ యాక్టు కోసం సూచనలు, సలహాలు తీసుకోవడానికి వర్క్ షాప్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ వర్క్ షాప్ కు రెవెన్యూ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, న్యాయవాదులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# మినీఫ్రీజర్ను ప్రారంభించిన సిఐ



కేసముద్రం ఆగస్టు 20 (రోమింగ్ న్యూస్): కేసముద్రం పోలీస్ స్టేషన్ లో సిబ్బందికి మరియు ఫిర్యాదుదారులకు దాహార్తి తీర్చేందుకు గాను మినీ ఫ్రీజర్ ను ప్రారంభించిన రూరల్ సీఐ సర్వయ్య,కేసముద్రం స్థానిక ఎస్సై మురలీధర్ రాజ్ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
21 ఆగస్టు
2024





# ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల స్క్రూటిని కట్టుదిట్టంగా నిర్వహణ

## రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




కామారెడ్డి, ఆగస్టు 20 (రోమింగ్ న్యూస్): ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల స్క్రూటిని కట్టుదిట్టంగా నిర్వహించాలని, జిల్లాలో అవసరమైతే అదనపు సిబ్బందిని తాత్కాలికంగా నియమించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర సి.ఎస్ శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఎల్.ఆర్.ఎస్, భారీ వర్షాలు, ధరణి , ఆర్.ఓ.ఆర్ చట్టం పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎల్.ఆర్.ఎస్ సంబంధించి దాదాపు 20 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వీటి స్క్రూటినీ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం స్క్రూటినీ త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల పై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపించి సకాలంలో పూర్తి చేయాలని, అవసరమైతే జిల్లాలో అదనపు సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలని మంత్రి సూచించారు.

ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులలో అవసరమైన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను సేకరించాలని, జిల్లాలో ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల ప్రకారం అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి వారు వివరాలు సేకరించి యాప్ లో నమోదు చేసేలా చూడాలని మంత్రి పేర్కొన్నారు.

ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను సర్వే నెంబర్ వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం/మున్సిపాలిటీ లలో బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన చేసి జిపిఎస్ ద్వారా సదరు భూమి కో ఆర్డినేట్స్ పక్కాగా నమోదు చేస్తారని, అదే సమయంలో ఈ భూములు నీటి వనరుల బఫర్ జోన్, నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్, డిఫెన్స్ ల్యాండ్ పరిధిలోవి కావని ధ్రువీకరించాలని అన్నారు. ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ 3 నెలలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

ఎల్.ఆర్.ఎస్ ప్రక్రియ ద్వారా ఎక్కడ ప్రభుత్వ భూమికి నష్టం కలగవద్దని, అదే విధంగా నీటి వనరులు, కాలువలు చెరువుల ఆక్రమణలకు పాల్పడలద్దని అధికారులకు సూచించారు. రాబోయే ఐదు రోజుల పాటు భారీ నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, నీటి వనరుల నిర్వహణ సమర్థవంతంగా ఉండాలని అన్నారు. ధరణి పోర్టల్ లో పెండింగ్ ఉన్న దరఖాస్తుల స్క్రూటిని పూర్తి చేసి పరిష్కరించాలని, తిరస్కరించే దరఖాస్తులకు సదురు కారణాలు తెలియజేయాలని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం ముసాయిదా బిల్లు ప్రతి పాదించిందని, దీని పై జిల్లా లలో ఆగస్టు 23,24 తేదీలలో వర్క్ షాప్ నిర్వహించి, ముసాయిదా బిల్లులో చేయాల్సిన మార్పులు, మెరుగైన సూచనలు ఏవైనా ఉంటే ఫీడ్ బ్యాక్ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి అందజేయాలని మంత్రి సూచించారు. జిల్లాలోని పోచారం, నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్టుల్లో నీటి మట్టం వివరాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చూడాలన్నారు. ముందస్తుగా వారిని అప్రమత్తం చేయాలన్నారు. జ్వరాలు వ్యాప్తి చెందే గ్రామాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు గుర్తించి ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. గ్రామాల్లోని పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ఆరోగ్య, ఆశ కార్యకర్తలతో గ్రామీణులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రామీణులు చెత్త బండికి ఇచ్చే విధంగా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని అధికారులు తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలని చెప్పారు. ధరణిలో పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కారం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ ఎస్.ఈ. శ్రీనివాస్, ఇన్చార్జి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ చంద్రశేఖర్, పర్యవేక్షకులు ప్రేమ్ కుమార్, ఉమలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ సలహాదారుగా పోచారం శ్రీనివాస్ రెడ్డి

## డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఛైర్మన్‌గా గుత్తా అమిత్

హైదరాబాద్,ఆగస్ట్20 : బీఆర్ఎస్‌కు గుడ్ బై కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఒక్కొక్కరికి ప్రాధాన్యత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పార్టీ కండువా కప్పుకున్న నేతలకు పదవులు ఇవ్వగా.. తాజాగా ఒక యంగ్ లీడర్‌కు, మరో సీనియర్ నేతకు కీలక పదవులు ఇస్తూ రేవంత్ సర్కార్ జీవోలు ఇవ్వడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా పోచారం శ్రీనివాస్ రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కేబినెట్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఛైర్మన్‌గా గుత్తా అమిత్ రెడ్డిని నియమించారు.

# టూరిజం అభివృద్ధితో ఉపాధికి అవకాశాలు

### అనేక ప్రాంతాలకు నేటికీ దక్కని గుర్తింపు

### మంత్రులు సీతక్క, జూపల్లి

హైదరాబాద్,ఆగస్ట్ 20 : టూరిజాం అంటే కొన్ని పట్టణాలకే పరిమితమైందని, కాలక్రమేణా చారిత్రాత్మక కట్టడాలకు ప్రాధాన్యత పెరిగిందని మంత్రి సీతక్క అన్నారు. టూరిజంను అబివృద్ధి చేసి ఉపాధిని పెంచాలని చూస్తున్నామని అన్నారు. గుర్తింపున నోచుకోక ఇబ్బందులు పడుతున్నామని, పల్లెలో ఉన్న ఆరోగ్యం, ఆనందం, పర్యాటకం ఎక్కడ ఉండదన్నారు. పల్లెలను అభివృద్ధి పథం లో తీసుకురావాలని ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని ఆమె అన్నారు. గోదావరి పర్యాటక ప్రాంతాలు ఇక్కడా ఉన్నాయి. ప్రకృతి సంపదను కాపాడుకుంటూ టూరిజాన్ని డెవెలప్ చేసుకోవాలని మంత్రి సీతక్క అన్నారు.. భవిష్యత్ తరాలకు కలలను,కళా కాండలను కాపడికోవాలని మంత్రి అన్నారు. .ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ధనిక రాష్ట్రం,8 లక్షల కోట్ల అప్పులు చేసిన తరువాత కూడా..నియోజకవర్గానికి వస్తు కొడవటంచ లక్ష్మి నరసింహ,కాటేజ్,హరిత హోటల్, పాండవుల గుట్ట..వేల సంవత్సరాల క్రితం పాండవుల గుట్టకు రాష్ట్రం నుంచి దేశం నుంచి కావాల్సిన సౌకర్యాలను తీసుకువస్తాం..హరిత హోటల్ ను ఏర్పాటు చేస్తాం..కోటగుళ్ళు,మైలారం గుహాలను అభివృద్ధి చేస్తాం..అపూర్వరుపమైన సంపద మన రాష్ట్రంలో ఉంది..చూడాల్సినది చాలా ఉన్నది. మనసుకు ఆహ్లాద వారవరనం ప్రకృతి లో ఉంది..నెలకు ఒక రోజు పర్యాటక ప్రాంతాలు తిరగాలి. ప్రతి నెలలో ఒక రోజు అందరం టూరిజాం ప్రాంతాలను సందర్శించాలి..దీని ద్వారా నిరుద్యోగులకు ఉపాధి దొరుకుకుతుంది.. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అందరం పని చేస్తున్నాం అని ఆయన తెలిపారు.

# అధ్యక్ష ఎన్నికల్లో కమలా హ్యారిస్ దూకుడు

### సంప్రదాయానికి భిన్నంగా ఎన్నికల ప్రసంగం

### క్రమంగా ప్రజల్లో పెరుగుతున్న మద్దతు

వాషింగ్టన్,ఆగస్ట్20 : అమెరికా వైస్ ప్రెసిడెంట్, డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ 'డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్'లో సంప్రదాయానికి విరుద్ధంగా ఆశ్చర్యకర ప్రసంగం చేశారు. సాధారణంగా అధ్యక్ష అభ్యర్థి కన్వెన్షన్ చివరి రోజున ప్రసంగం చేస్తారు. కానీ అందుకు విరుద్ధంగా మొదటి రోజునే మాట్లాడిన కమలా హ్యారీస్.. అధ్యక్షుడు జో బైడెన్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. అమెరికాకు జీవితాంతం సేవ చేసిన అధ్యక్షుడు జో బైడెన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బైడెన్‌కు తాను ఎన్నటికీ రుణపడి ఉంటానని భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు చికాగోలో జరిగిన డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో కమలా హ్యారీస్ మాట్లాడారు. మన అద్భుతమైన అధ్యక్షుడు జో బైడెన్ గురించి మాట్లాడడం ద్వారా ఈ సమావేశాలను ప్రారంభించాలనుకుంటున్నాను. జో.. మీ చారిత్రాత్మక నాయకత్వానికి, దేశానికి జీవితాంతం సేవ అందించిన మీకు ధన్యవాదాలు. మేమంతా మీకు ఎల్లప్పుడూ కృతజ్ఞులుగా ఉంటాం అని కమలా హ్యారీస్ అన్నారు. సాధారణంగా అధ్యక్ష అభ్యర్థి కన్వెన్షన్ చివరి రోజున ప్రసంగిస్తారు. కానీ హ్యారిస్ ఆ సంప్రదాయాన్ని పక్కన పెట్టి ఆశ్చర్యకరంగా తొలి రోజే మాట్లాడారు. దీంతో సభా ప్రాంగణం మొత్తం కమలా హ్యారీస్ నినాదాలతో మార్మోగింది. మరోవైపు పార్టీ సమావేశ ప్రాంగణంలో ఆమెకు ఘనస్వాగతం లభించింది. కాగా డెమొక్రాటిక్ పార్టీ నామినీగా అధికారికంగా ఈ సమావేశాల్లో ఆమోదించనున్నారు. ఇదిలావుంటే అమెరికా అధ్యక్ష ఎన్నికలు-2024లో ప్రస్తుత ఉపాధ్యక్షురాలు, డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హ్యారీస్ దూసుకుపోతున్నారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కమల గట్టి పోటీ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించేందుకు 'డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్' సిద్ధమవుతున్న వేళ కమల, డెమొక్రాటిక్ శ్రేణులకు మరింత ఉత్సాహాన్ని కలిగించే వార్త వచ్చింది. 'ది అసోసియేటెడ్ ఎన్‌వోఆర్‌సీ సెంటర్ ఫర్ పబ్లిక్ అ÷ర్స్ రీసెర్చ్ తాజాగా నిర్వహించిన పోల్‌లో పెద్ద వయస్కుల్లో ఆమె ఆదరణ గణనీయంగా పెరిగింది. తాజా పోల్ ప్రకారం..అమెరికా పెద్దల్లో దాదాపు 48 శాతం మంది కమలా హ్యారీస్ వైపు మొగ్గుచూపుతున్న ట్టు తేలింది. గతంతో 39 శాతం మంది మద్దతు మాత్రమే లభించగా ప్రస్తుతం దాదాపు సగం మంది ఆమె వైపే మొగ్గుచూపుతున్నారని పోల్ డేటా పేర్కొంది. అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి అధ్యక్షుడు జో బైడెన్ తప్పుకున్నప్పుడు కమలా హ్యారీస్‌కు కేవలం 39 శాతం మంది మాత్రమే మద్దతు పలికారని, ఇప్పుడు ఆదరణ గణనీయంగా పెరిగిందని పోల్ సర్వే పేర్కొంది. ఇంతకాలం మాజీ అధ్యక్షుడు ట్రంప్ పట్ల పెద్ద వయస్కులు సానుకూల అభిప్రాయంతో ఉన్నారంటూ అంచనాలు వెలువడ్డాయి. అయితే ప్రస్తుతం 41 శాతం మంది పెద్ద వయస్కులు మాత్రమే ట్రంప్‌ను అధ్యక్షుడిగా కోరుకుంటున్నారు. అత్యధికులు కమలా హ్యారీస్‌నే కోరుకుంటున్నారు. అధ్యక్ష అభ్యర్థిగా కమలా హ్యారీస్ పేరుని పరిశీలిస్తున్న సమయంలో ఆమె ఎవరో తెలియదని నాడు 12 శాతం మంది చెప్పగా.. ఇప్పుడు ఆ సంఖ్య 6 శాతానికి తగ్గిందని సర్వే గణాంకాలు స్పష్టం చేశాయి. జూన్ నెల నుంచి కమలా హ్యారీస్ మద్దతు క్రమక్రమంగా పెరుగుతోంది. అన్ని వర్గాల్లోనూ ఆమెకు ఆదరణ లభిస్తోంది. డెమోక్రాట్ పార్టీ సభ్యులతో పాటు తటస్థ ఓటర్లు, మహిళలు, 30 ఏళ్లలోపు యువతలో కమలా హ్యారీస్‌కు ఆదరణ స్వల్పంగా ఎక్కువగా కనిపిస్తోంది. నల్లజాతి వారు, స్పానిష్ మాట్లాడే సమూహాలు కూడా హ్యారీస్ వైపే మొగ్గుచూపుతున్నట్టుగా సంకేతాలు ఉన్నాయి. కాగా నవంబర్ నెలలో అమెరికా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ జరగనుంది.

# ఫిషరీస్ చేపల యూనిట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నకిరేకల్ ఆగస్టు 20 ( రోమింగ్ న్యూస్) : నకిరేకల్ మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన రాసమల్ల సత్యనారాయణ నూతనంగా ఏర్పాటు చేసిన "రాసమల్ల ఫిషరీస్ చేపల ప్రాసెసింగ్ యూనిట్" ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం ప్రారంభించారు ఈ సందర్భంగా యూనిట్ ఏర్పాటు చేసిన సత్యనారాయణ ను ఎమ్మెల్యే అభినందించారు సత్యనారాయణ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ఆయా పార్టీల నాయకులు పలువురు పాల్గొన్నారు

# మెగా రక్తదాన శిబిరం



కేసముద్రం ఆగస్టు 20 (రోమింగ్ న్యూస్): కేసముద్రం మండల కేంద్రం హరిహర గార్డెన్ లో లైన్స్ క్లబ్ ఆఫ్ కేసముద్రం మరియు రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్ అధ్యక్షతన లయన్స్ క్లబ్ సభ్యుడు మడిపెద్ది వెంకటేష్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగ ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా రూలర్ సిఐ సర్వయ్య, కేసముద్రంఎమ్మార్వో దామోదర్ ఎస్సై మురళీధర్ రాజ్ విచ్చేసి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో 50 యూనిట్ల వరకు బ్లడ్ డొనేషన్ చేయడం జరిగింది.బ్లడ్ డొనేషన్ చేసిన దాతలు అందరికి ముఖ్య అతిథులందరూ అభినందించి సర్టిఫికెట్ ప్రధానం చేసారు. అలాగే రక్తదాన శిబిరం ఏర్పాటుచేసిన బర్త్ డే బాయ్ మడిపెద్ది వెంకటేష్ ని అభినందించారు.ఒక్క యూనిట్ ఒక్కరి ప్రాణం కాపాడుతుంది ఆపదలో ఉన్నవారికి బ్లడ్ చాలా ఉపయోగపడుతుంది ఆపద సమయంలో బ్లడ్ యొక్క విలువ తెలుస్తుందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ జిల్లా ట్రెజరర్ మాధవ పెద్ది వెంకటరెడ్డి (మాజీ ఎంఆర్ఓ) గొర్రె వెంకన్న మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి డాక్టర్ హితిష్ కుమార్ టెక్నీషియన్ కిరణ్,సుమన్ రెడ్డి సిబ్బంది అరుణ,సరిత,నౌసిన్ రాజ్ కుమార్,మరియా, మరియు క్లబ్ సెక్రటరీ రావుల నవీన్ రెడ్డి,ట్రెజరర్ సత్యనారాయణ,ఫాస్ట్ జెడ్ సి చిర్రా యాకంతం గౌడ్,ఎర్నం శ్రీరాములు,ఊకంటి యాకుబ్ రెడ్డి,సభ్యులు కరివేదుల కృష్ణారెడ్డి, మారం సమ్మిరెడ్డి, చింత కర్ణాకర్, బెజ్జం ప్రేమ్ కుమార్, పరంకుశం శ్రీహరి, తంగళ్ళపల్లి భాస్కర్, బోగోజు నాగేశ్వర చారి,రుద్ర శ్రీకాంత్, దాసరి అశోక్ కుమార్,సట్ల శివ భరత్ చిదిర ఆనంద్ గంజి వీరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూఢనమ్మకాల నిర్మూలన సమితి సమావేశం



హైదరాబాద్, ఆగస్టు 20 (రోమింగ్ న్యూస్): మంగళవారం హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నందు మూఢనమ్మకాలు నిర్మూలన సమితి సమావేశం నిర్మించడం జరిగింది. ఈ సమావేశంలో పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అదేవిధంగా మూఢనమ్మకాలు నిర్మూలనా చట్టం కోసం సీఎంను కలిసి రిప్రెసెంటేషన్ ఇవ్వాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక, విజ్ఞానదర్శిని, మానవ వికాస వేదిక, కుల నిర్మూలన సంఘం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ తదితర సంస్థలు ప్రతినిధులు పాల్గొన్నారు.

# కోల్‌కతా హత్యాచార కేసు

## మాజీ ప్రిన్సిపాల్‌కు బిగుస్తున్న ఉచ్చు

కోల్‌కతా,ఆగస్ట్ 20 : పశ్చిమబెంగాల్‌లో హత్యాచార ఘటన వేళ.. ఆర్‌జీ కార్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. తాజాగా ఆయనపై కోల్‌కతా పోలీసు అవినీతి కేసు నమోదు చేశారు. ఆసుపత్రిలో ఆర్థిక అవకతవలపై జూన్‌లో ఫిర్యాదు నమోదైనట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. అప్పటినుంచి దానిపై పోలీసులు విచారణ జరుపుతున్నారని పేర్కొన్నాయి. ఇదిలాఉంటే.. ఈ ఘటన జరిగిన ఆర్‌జీ కార్ ఆసుపత్రికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను పరిశీలించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో అనూహ్య నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక సిట్‌ను ఏర్పాటుచేసి అధిపతిగా ఐజీ ప్రణవ్ కుమార్‌ను నియమించింది. నెలలోగా తొలి నివేదిక సమర్పించాలని కోరింది. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.



## హరీష్ రావు రాజీనామా చేయాల్సిందే

### రుణమాఫీ చేసినందున సవాల్‌కు నిలబడాలి

### మాజీ ఎమ్మెల్యే మైనంపాటు సవాల్

సిద్దిపేట,ఆగస్ట్ 20 : ఎమ్మెల్యే హరీష్ రావుకి మైనంపల్లి హనుమంతరావు సవాల్ విసిరారు. రుణమాఫీ చేసినందుకు హరీష్‌రావు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉప ఎన్నికల్లో ఇద్దరం నిలబడదామని, మళ్లీ హరీష్ రావు గెలిస్తే నేను ఎన్నికల్లో పోటీ చేయనని ఆయన అన్నారు. సిద్దిపేటలో రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీకి రావాలి మైనంపల్లి హనుమంత రావు డిమాండ్ చేశారు. సిద్ధిపేటలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య పోటాపోటీ వాతావరణం నెలకొంది. బీఆరెస్ రుణమాఫీ సమస్యపై సమావేశం నిర్వహించగా, కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ సంబర సభను నిర్వహించింది. కాంగ్రెస్ సభకు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా ఆగస్టు 15తేదీ నాటికి రుణమాఫీ చేశారని, హరీష్ రావు చేసిన సవాల్ మేరకు ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిద్ధిపేట ఉప ఎన్నికల్లో ఇద్దరం పోటీ చేద్దామని, మళ్లీ హరీష్ రావు గెలిస్తే నేను భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయబోనని మైనంపల్లి హనుమంతరావు అన్నారు. నా సవాల్‌కు హరీష్ రావు ముందుకు రావాలని ఆయన అన్నారు. నీకు మైనంపల్లి పీడ పోవాలంటే రాజీనామా చేసి నాతో ఎన్నికల్లో తలపడాలని ఆయన అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో మైనంపల్లి లేదా హరీష్ రావు ఒక్కరే ఉండాలన్నారు.

## కెసిఆర్ ట్యూనింగ్..కిషన్ రెడ్డి మ్యూజిక్

### రుణమాఫీపై విపక్షాల మాటలు నమ్మకండి

### మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన

సిద్దిపేట,ఆగస్ట్ 20 : కేసీఆర్ ట్యూనింగ్ చేస్తే.. కిషన్ రెడ్డి మ్యూజిక్ ఇస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 2018 డిసెంబర్ 12 నుండి 2023 డిసెంబర్ 9 లోపు రూ.2 లక్షలు రుణాలు పొందిన రైతులందరికి రుణమాఫీ జరుగుతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రతి పక్షాల తప్పుడు ప్రచారంతో రైతులు కంగారు పడొద్దన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విదంగా తెలంగాణాలో 2లక్షల రుణమాఫి ఒకేసారి చేసిన ఘనత మాదే అన్నారు. పదేళ్లలో బీజేపీ, బీఆర్ఎస్ అధికారంలో ఉండి రైతులకు ఏమిచేశారని ఆందోళన చేస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసి ఓట్లు బదలాయింపు చేసుకున్న 8 సీట్లు దాటలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేస్తున్నాం మిగిలినవి పూర్తి చేసే పనిలో ఉన్నామన్నారు. రాఖీ పండుగ సందర్భంగా అక్కా చె÷-లలెలు సంతోషంగా బస్సులో ప్రయాణిచేందుకు కృషి చేసిన ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు, దాదాపు 15 కోట్ల ఆదాయం సమాకూరిం దన్నారు. దేశంలో సాంకేతిక విప్లవం తెచ్చిన రాజీవగాంధీ విగ్రహాన్ని సెక్రటరీ కార్యాలయం ముందు ఏర్పాటు చేస్తామన్నారు. అవగాహన లేకుండా కేటీఆర్ విగ్రహాన్ని కూల్చివేస్తామని మాట్లాడడం సరికాదు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని వార్నింగ్ ఇచ్చారు. దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన వ్యక్తి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని టచ్ చేసే ధైర్యం ఉందా కేటీఆర్? అని ప్రశ్నించారు. కేసీఆర్ ట్యూనింగ్ చేస్తే కిషన్ రెడ్డి మ్యూజిక్ ఇస్తుందని కీలక వ్యాఖ్యలు చేశారు.

## లేటరల్ ఎంట్రీ' పోస్టులపై కేంద్రం యూటర్న్

### విపక్షాల నుంచి వ్యతిరేకత రావడంతో తగ్గిన ప్రభుత్వం

### కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్.. కీలక ఉత్తర్వులు జారీ

న్యూఢిల్లీ,ఆగస్ట్ 20 : వివిధ మంత్రిత్వ శాఖలలో 'లేటరల్ ఎంట్రీ' ద్వారా పోస్టుల భర్తీపై కేంద్ర ప్రభుత్వం యూటర్న్ తీసుకుంది. కేంద్ర ప్రభుత్వంలోని 45 కీలక పదవుల్లోకి కాంట్రాక్టు పద్ధతిలో ప్రైవేటు వారిని నియమించడానికి యూపీఎస్సీ జారీ చేసిన 'ల్యాటరల్ ఎంట్రీ'పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో బీజేపీ సర్కార్ వెనక్కి తగ్గింది. ఈ మేరకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్.. కీలక ఉత్తర్వులు జారీ చేశారు. యూపీఎస్సీ నిర్ణయం సామాజిక న్యాయంతో ముడిపడి ఉండాలని పేర్కొన్నారు. యూపీఎస్‌సీ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని యూపీఎస్‌సీ ఛైర్మన్‌కు లేఖ రాశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు లేఖలో పేర్కొన్నారు. సామాజిక న్యాయంపై మోదీ సర్కారు దృష్టి సారించిన నేపథ్యంలో ఈ అంశాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. లేటరల్ ఎంట్రీ పద్ధతిలో 45 మంది సంయుక్త కార్యదర్శులు, ఉప కార్యదర్శులు/ డైరెక్టర్ల నియామకానికి యూపీఎస్సీ ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించింది. దీన్ని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ తప్పుపట్టారు. దానిని జాతి వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల రిజర్వేషన్లను లాక్కుంటున్నారని ఆరోపించారు. ఉన్నత స్థానాల్లో అణగారిన వర్గాలకు ఇప్పటికే ప్రాతినిధ్యం దక్కడం లేదని.. దీన్ని మెరుగుపరిచే బదులు.. లేటరల్ ఎంట్రీ ద్వారా వారిని ఆ పదవులకు దూరం చేస్తున్నారన్నారు. సమాజ్‌వాదీ, బీఎస్పీ సైతం ఈ విధానాన్ని వ్యతిరేకించాయి. భాజపా తమ అనుయాయులను పెద్ద పదవుల్లో కూర్చోబెట్టేందుకు చేస్తున్న కుట్రగా పేర్కొన్నాయి. దీన్ని జాతివిద్రోహ చర్యగా అభివర్ణించిన ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్.. అక్టోబర్ 2న దీనిపై ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బీఎస్పీ అధినేత్రి లేటరల్ ఎంట్రీలను రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా అభివర్ణించారు. ప్రతిపక్షాల విమర్శలను భాజపా దీటుగా తిప్పికొట్టింది. లేటరల్ ఎంట్రీ నియామకాల్లో పాటించే నిబంధనలను గుర్తుచేసే పలు ఆదేశాలను ఉటంకించింది. ఈ విధానంలోనూ రిజర్వేషన్లను కచ్చితంగా పాటించాలంటూ 2020లో కేంద్ర హోంశాఖ విడుదల చేసిన ఓ మెమోను గుర్తుచేసింది. రాహుల్ గాంధీ చెప్పేవన్నీ అబద్ధాలని కొట్టి పారేసింది. ఈ విమర్శలపై ఇదివరకు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. 'ఉన్నతోద్యోగాల్లో లేటరల్ ఎంట్రీపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు ఆ పార్టీ ద్వంద్వ వైఖరిని సూచిస్తున్నాయి. ఈ విధానాన్ని తీసుకొచ్చింది గత యూపీఏ ప్రభుత్వమే. 2005లో వీరప్ప మొయిలీ అధ్యక్షతన నియమించిన రెండో ఎస్సార్సీ సైతం ఈ విధానాన్ని బలంగా సమర్థించింది. దాన్ని
అమలుచేసేందుకు ఎన్‌డీయే ప్రభుత్వం పారదర్శక విధానాన్ని తీసుకొచ్చిందని అన్నారు.
ఈ ప్రకటనను కేంద్రమంత్రి, ఎన్డీఏ భాగస్వామ్య లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్‌తో పాటు ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ఈ పద్ధతిని తప్పుపట్టారు.

## సిఎం పదవిపై కన్నేసిన పొంగులేటి

### బిజెఎల్‌పి నేత మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,ఆగస్ట్20 : కర్ణాటకలో డీకేశివకుమార్‌లా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణలో కీలక పాత్ర పోషిస్తున్నాడని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. 'పొంగులేటి ఇక్కడ డీకే శివకుమార్ పాత్ర పోషిస్తున్నాడు. ఢిల్లీలో కదిపే పావులు చూస్తే పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంకేదో పదవి ఆశిస్తున్నాడనిపిస్తోందని అన్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి కన్ను సీఎం పదవిపై పడింది. సీఎంను కాదని కొడంగల్ అభివృద్ధి కాంట్రాక్టు పొంగులేటికి వచ్చింది. భట్టి ఉపముఖ్యమంత్రిగా సెకండ్ ప్లేస్‌లో లేరు. అమెరికా పర్యటనలో రేవంత్ తీసుకొచ్చిన వేల కోట్లు ఎప్పుడు వస్తాయి? ఎంత మందికి ఉద్యోగాలు వస్తాయి? సీఎం కుటుంబ సభ్యుల్లో ఎవరెంత పెట్టుబడి పెడుతున్నారు. వీటన్నింటిపై స్పష్టత ఇవ్వాలన్నారు. మంత్రిగా ఉన్న వ్యక్తి కంపెనీకి ప్రభుత్వ కాంట్రాక్టు రావడం చరిత్రలో లేదు. ఎస్కలేషన్, ప్రైస్ హైక్ మీద మాకు అనుమానం ఉంది. తన వెంట కొంత మంది ఎంఎల్‌ఏలు ఉన్నారని భయపడి పొంగులేటి కి కాంట్రాక్టు ఇచ్చారా అన్నదానికి సీఎం సమాధానం చెప్పాలి. కొంత మంది ఎమ్మెల్యేలను వెంటబెట్టుకుని పొంగులేటి సీఎంను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మహేశ్వర్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు.

# పేదల జీవితాల్లో మార్పు కోసం యత్నం

### సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు

### బ్రాక్ ప్రతినిధులతో మంత్రి సీతక్క భేటీ



హైదరాబాద్,ఆగస్ట్ 20 : నిరుపేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలు అమలు చేస్తోందని అన్నారు. అయితే ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా అనుకున్న స్థాయిలో అభివృద్ధి ఫలాలు పేదలకు చేరటం లేదని అన్నారు. పలు దేశాల్లో గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం పని చేస్తున్న అంతర్జాతీయ సంస్థ బ్రాక్ ప్రతినిధులతో సచివాలయంలో మంగళవారం సమావేశమైన మంత్రి సీతక్క మాట్లాడుతూ మారు మూల ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి కల్పన వంటి రంగాల్లో పనిచేస్తున్న బ్రాక్, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిందని అన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాల్లో ప్రజల స్థితిగతులను, అమలవుతున్న సంక్షేమ పథకాల తీరును క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన బ్రాక్ ఈ సమావేశంలో ఆ వివరాలను మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మారిన పరిస్థితులు అవసరాల నేపథ్యంలో పేదలు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారని అన్నారు. పేదరికం నుంచి వచ్చిన నాకు పేదలతో పేగు బంధం ఉందని అన్నారు. సమాజంలో ఇంకా అసమానతలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిరుపేదలకు అట్టడుగు, వర్గ ప్రజలకు కనీస వసతులు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బహు రూపాల్లో పేదరికం ఇంకా కొనసాగటం బాధాకరమని అన్నారు. పేదరికన్ని రూపుమాపే దిశలో అంతా కలిసి పని చేయాలని కోరారు. అందరం అంకితభావంతో పని చేస్తే పేదరికం అనేది ఉండదని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన కోసం తమ ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని వివరించారు. క్షేత్రస్థాయిలో పథకాలు అమలవుతున్న తీరును బ్రాక్ వంటి సంస్థలు అధ్యయనం చేయడం అభినందనీయమని తెలిపారు. పేదరిక నిర్మూలన కోసం తమ పభుత్వం చేస్తున్న పోరాటంలో పాలుపంచుకోవాలని కోరారు. పేదలకు మెరుగైన విద్యా, వైద్యం, ఉపాధి కల్పనలో తమప్రభుత్వానికి చేయూత నివ్వాలని కోరారు. బ్రాక్ అడ్వైజర్ శ్వేతా బెనర్జీతో పాటు పలువు ప్రతినిధులను మంత్రి సీతక్క ఈ సందర్భంగా సన్మానించారు.

## హైకోర్టుకు చేరిన వేణుస్వామి వ్యవహారం

### మహిళా కమిషన్ ఫిర్యాదులపై సవాల్

### విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్,ఆగస్ట్ 20 : ప్రముఖ జోతిష్యుడు వేణుస్వామి వివాదం తెలంగాణ హైకోర్టుకు చేరింది. ఇటీవల నటుడు అక్కనేని నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థంపై ఆయన చేసిన వ్యాఖ్యలకు గాను మహిళా కమిషన్ నోటీసులు ఇచ్చింది. తనకు నోటీసులు ఇవ్వడాన్ని హైకోర్టులో వేణుస్వామి సవాల్ చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన హైకోర్టు.. స్వామికి నోటీసులు ఇవ్వడానికి ఎలాంటి అర్హత ఉందని మహిళా కమిషన్‌ను ప్రశ్నించింది. అతను జ్యోతిష్యాల పేరుతో అసత్య, మోసపూరిత వ్యాఖ్యలు చేస్తున్నాడంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హైకోర్టుకు తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను బుధవారం నాటికి వాయిదా వేసింది. జ్యోతిష్యుడు వేణుస్వామి ప్రము-ఖులపై వ్యాఖ్యలు చేస్తూ తరచూ వార్తలో నిలుస్తుంటారు. గతంలోనూ ఆయన అనేక మంది సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై మాట్లాడారు. నాగచైతన్య, సమంత వివాహ సమయంలోనూ వారు త్వరలో విడిపోతారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. అలాగే కొణిదల ఉపాసన, యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ సహా అనేక మంది గురించి ఆయన తీవ్రంగా మాట్లాడారు. దీనిపై ఆయా హీరో, హీరోయిన్ల ఫ్యాన్స్ అతనిపై నిప్పులు చెరిగారు. యితే తాజాగా నాగచైతన్య, శోభితా నిశ్చితార్థం జరగగా.. వారు త్వరలో విడిపోతారంటూ వేణుస్వామి చేసిన వ్యాఖ్యలపై అక్కినేని ఫ్యాన్స్ మండిపడ్డారు. అసలే సమంతతో విడిపోయి ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న తమ అభిమాన హీరో జీవితం గురించి మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త జంట వైవాహిక జీవితంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని కొందరు జర్నలిస్టులు, ఫ్యాన్స్ ఆయనపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఆయనకు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులు సవాల్ చేస్తూ ఆయన హైకోర్టు తలుపు తట్టారు.

## రాజీవ్ విగ్రహం కూలుస్తామంటే చూస్తూ ఊరుకుంటామా ?

### రాజీవ్ గురించి అడ్డదిడ్డంగా మాట్లాడితే బుద్ధి చెబుతాం ఘాటుగా హెచ్చరించిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్ 20 : రాజీవ్ గాంధీ విగ్రహం కూలగొడతామంటే తామేమైనా ఖాళీగా కూర్చున్నామా కేటీఆర్ అంటూ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కన్నెర్ర జేశారు. తల్లి గుండెల్లో ఉండాలి కాబట్టి తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ విగ్రహం ముట్టుకుంటే చెప్పుతో కొడతామన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందన్నారు. రాజీవ్ గాంధీ లాంటి గొప్ప నాయకుని గురించి అడ్డదిడ్డంగా మాట్లాడితే మర్యాదగా ఉండదంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌కు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ భవన్ ముందు ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామంటూ కేటీఆర్ చేసిన కామెంట్స్‌పై ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్, బీజేపీలకు సరైన వ్యక్తి రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పదేళ్లు నరకం చూపించింది కాబట్టే.. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించారన్నారు. 'మా ధైర్యం, మా సాహసాల మీద నువ్వెంత. మీరు చాకులు తెస్తే.. మేము చాకులు తెస్తాం. కేటీఆర్ చీప్ లిక్కర్ తాగినోడి లాగా మాట్లాడుతుండు మీ అయ్య కేసీఆర్ చారాణ చేస్తే, నువ్వు బారాణ చెప్తావు. మేము సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి గులాం గిరి చేస్తాం నిజమే.' అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఐదు సంవత్సరాల తరువాత రాజీవ్ గాంధీ విగ్రహం తీసేసే దమ్ము, ధైర్యం మీకు లేదంటూ కేటీఆర్‌కు చురకలంటించారు. అయినా మీరు విగ్రహం తీసేయాలంటే అధికారంలోకి రావాలని.. కానీ ప్రజలు ఆ అవకాశం మీకు ఇవ్వరని కేటీఆర్‌కు జగ్గారెడ్డి కౌంటర్ ఇచ్చారు. మరో ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాలు పరిపాలన చేయమని తమకు ప్రజలు అవకాశం ఇచ్చారని.. తమ పాలన చూసి మరో ఐదేళ్లు కూడా అవకాశం ఇస్తారన్నారు. బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని.. తాము రానివ్వబోమని స్పష్టం చేశారు జగ్గారెడ్డి. ప్రజల మధ్యలో ఉండి ప్రజల కోసం పని చేస్తామన్నారు. యూపీఏ ప్రభుత్వంలో కేసీఆర్ కేంద్ర మంత్రిగా పని చేశాడని జగ్గారెడ్డి గుర్తు చేశారు. కేసీఆర్ కుటుంబం మొత్తం ఢిల్లీలో ఉన్న సోనియా గాంధీ ఇంటికి వెళ్లిన విషయాన్ని ప్రస్తావించిన కాంగ్రెస్ నేత.. మీరు చేసింది గులాం గిరి కాదా? అని ప్రశ్నించారు. దీనిపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం మీ కుటుంబం మొత్తం ఢిల్లీకి పోయినప్పుడు సోనియా గాంధీకి గులాం గిరి చేసినట్లు అనిపించలేదా? అని నిలదీశారు. దేశ ప్రజల కోసం రాజీవ్ గాంధీ బలిదానం కావడం నిజమా? కాదా? అని ప్రశ్నించారు. 18 సవత్సరాలు ఉన్న ప్రతి యువతి, యువతులకు రాజీవ్ గాంధీ ఓటు హక్కు కల్పించారని.. రాజీవ్ గాంధీ తెచ్చిన టెక్నాలజితో చదువుకొని కేటీఆర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. అలాంటి మహనీయుడికి ధన్యవాదాలు తెలిపే గుణగణాలు కూడా లేవని కేటీఆర్‌పై జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు. కేటీఆర్‌కు ఇంకా మాట్లాడటం రావడం లేదని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. పొలిటికల్ కోచింగ్ సెంటర్‌లో ట్రైనింగ్ తీసుకుంటే మంచిదన్నారు. కేటీఆర్‌కు ఎలాంటి ఇష్యూ మీద మాట్లాడాలో తెలియడం లేదని విమర్శించారు. కేటీఆర్ మాత్రమే కాకుండా.. కేటీఆర్‌కు కూడా కోచింగ్ ఇప్పించడం ఉత్తమం అని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో జర్నలిస్టుల సమస్యలను సైతం ప్రస్తావించారు జగ్గారెడ్డి. పదేళ్ల
కాలంలో జర్నలిస్టుల సమస్యల కోసం, ప్లాట్ల కోసం ఏనాడైనా అల్లం నారాయణ పోరాటం చేశాడా? అని ప్రశ్నించారు. అల్లం నారాయణ మేధావి అనడం పెద్ద జోక్ అని.. ఆయన ఒక జోకర్ అంటూ ఘాటైన జగ్గారెడ్డి వ్యాఖ్యలు చేశారు.

## భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్లను ఆదేశించిన ప్రభుత్వం

### సమీక్షించిన మంత్రి, సిఎస్

హైదరాబాద్,ఆగస్ట్ 20 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై సీఎస్ శాంతి కుమారితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. వచ్చే ఐదు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జనజీవనానికి ఎలాంటి ఇబ్బంది ఆటంకాలు వచ్చే ఐదు రోజుల్లో వర్షాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక పరిస్థితులను బట్టి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే నిర్ణయాన్ని కలెక్టర్లు తీసుకోవాలి. గత రాత్రి నుంచి గ్రేటర్ హైదరాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసినా వీలైనంత మేరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీస్కోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితిని గురించి మంత్రి కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ÷రిళితట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

## రుణమాఫీపై రైతులతో కాంగ్రెస్ చెలగాటం

### రైతుల ధర్నాకు మద్దతు ఇచ్చిన ఎర్రబెల్లి

జనగామ,ఆగస్ట్ 20 : రుణమాఫీ ఎగ్గొట్టి రైతులతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామంలో రుణమాఫీ కాలేదని ఆరోపిస్తూ రైతులు బ్యాంక్ ఎదుట చేపట్టిన ధర్నాకి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మొదటగా రైతు రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరం అని చెప్పి మాట మార్చింది. చివరికి రూ.17 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిందని మండిపడ్డారు. రుణమాఫీ కాక ఆందోళనలో ఉన్న లక్షలాది మంది రైతులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీనిచ్చారు. పాలకుర్తి నియోజకవర్గంలో కనీసం పంట పండించుకునేందుకు రైతులకు సాగునీరు కూడా అందియలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం దిగివచ్చి పూర్తిగా రుణమాఫీ చేసి రైతులకు సాగునీరు అందివ్వాలని డిమాండ్ చేశారు. కనీసం 40 శాతం కూడా రుణమాఫీ కాకముందే రుణమాఫీ అయిపోయిందని సంబురాలు చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం 21
ఆగస్టు 2024





# రుణమాఫీపై ఎందుకీ దోబూచులాట

## సిఎం, మంత్రుల మధ్య అవగాహనా లోపం

## మాజీమంత్రి హరీష్ రావు ఆగ్రహం



సిద్దిపేట,ఆగస్ట్20 : రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రూ.31 వేల కోట్ల రుణమాఫీ పూర్తి చేసినట్టు చెప్పడం హాస్యాస్పదమని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ నాయకులు తలాతోక లేకుండా రోజుకో తీరుగా మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులంతా ఆందోళన చేస్తున్నారని చెప్పారు. సీఎం, మంత్రులు ఇష్టానుసారం మాట్లాడి గందరగోళం సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. రుణమాఫీ జరిగితే రైతులు ఎందుకు ఆందోళన చేస్తారని ప్రశ్నించారు. రుణమాఫీపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ముఖ్యమంత్రేమో రుణమాఫీ పూర్తి చేసినట్లు డబ్బా కొడుతున్నారని.. మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రం రుణమాఫీ పూర్తి కాలేదంటున్నరని అన్నారు. మొన్న ఖమ్మం వేదికగా సీఎం రేవంత్ రెడ్డి రూ.18వేల కోట్లతో రుణమాఫీ పూర్తిగా చేసినట్లు ప్రకటించారన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రుణమాఫీ పూర్తికాలేదని.. ఇంకా 12 వేల కోట్లు కూడా విడుదల చేస్తామన్నారని తెలిపారు. మరో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఇంకా 17 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదంటున్నారన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలోనే పచ్చి అబద్ధం చెప్పారని అన్నారు. ఏకంగా 31వేల కోట్ల రుణమాఫీ పూర్తి చేసినట్లు ప్రకటించారని.. ఏది నిజం. ఇందులో ఎవరి మాటలు నమ్మాలో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. ఒకవైపు రుణమాఫీ కాక రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నారన్నారు. భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి, మంత్రులు నోటికొచ్చినట్లు మాట్లాడి మరింత గందరగోళం సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీపై కాంగ్రెస్ నేతలు రోజుకో తీరున మాట్లాడుతున్నారని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ.31వేల కోట్ల రుణమాఫీ జరిగిందని చెప్పారు, సీఎం సమక్షంలోనే భట్టి అసత్యాలు చెప్పారని విమర్శించారు.

# హైడ్రాలో అధికారులపై చర్యలు తీసుకోరా

## సామాన్యులనే బలిపశువులను చేస్తే సహించం

## అవసరమైతే మరో తెలంగాణ ఉద్యమం మొదలు పెడతాం

## కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హెచ్చరిక

హైదరాబాద్,ఆగస్ట్ 20 : హైడ్రా ఆలోచన బాగున్నా.. ఆచరణలో అది సాధ్యం కావడం లేదని భాజపా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. హైడ్రా వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోకుండా సామాన్యులపై పడడం సరికాదన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రాతో మరో తెలంగాణ ఉద్యమం మొదలు పెడతామని మెచ్చరించారు. భూమి కొనుగోలు చేసినప్పుడు చాలా మందికి అది ఏ పరిధిలోనిది అనేది తెలియదు. హెచ్‌ఎండీఏ పరిధిలో భూమి ఉందా? అనుమతులున్నాయా? లోన్ వస్తుందా? అనేది మాత్రమే ప్రజలు చూస్తారు. రియల్టర్లకు అనుమతులు ఎవరిచ్చారు?లేఔట్ వేసేందుకు పర్మిషన్లు ఇచ్చిందెవరు? ప్రభుత్వ అనుమతులతోనే ప్రజలు గతంలో భూములు, ప్లాట్లు కొన్నారు. బఫర్ జోన్లు, చెరువులు, శిఖం భూములని తెలియకుండా, ప్రభుత్వ అనుమతులు లేకుండానే రియల్టర్ల చేతుల్లోకి వెళ్లాయా? ప్రభుత్వానికి తెలియకుండానే ఎఫ్‌టీఎల్ ప్రకారం డాక్యుమెంట్లు ఎలా తయారయ్యాయి? అనుమతి లేకుండానే లేఔట్లు ఎలా అయ్యాయి?ఇళ్ల నిర్మాణంతో పాటు ప్లాట్లు ఎలా అమ్ముడయ్యాయి? దానికి బాధ్యులెవరు? అనుమతి ఇచ్చిన జీహెచ్‌ఎంసీది తప్పా? కమిషనర్లది తప్పా?బఫర్ జోన్లు, చెరువులు, శిఖం భూములని తెలిసి అనుమతులు ఎలా ఇచ్చారన్నది తెలపాలని అన్నారు. బాధ్యులైన అధికారులపై సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌లు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో చెప్పాలి. చెరువులు, బఫర్ జోన్లు, శిఖం భూములంటూ ఏ ప్రాతిపదికన ఇళ్లు కూలుస్తున్నారు? గతంలో అనుమతులు ఇచ్చిన అధికారులను వదిలేసి.. సామాన్యులపై పడటం ప్రజాపాలన అవుతుందా?ఇష్టారీతిన డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు ఉండవా అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారుతున్నా.. ప్రజల తలరాతలు మారడం లేదు. హైడ్రా కొత్తగా సాధించిందేమీ లేదు.. సామాన్యుల బతుకులు కూల్చడం తప్ప. హైడ్రాపై మరో తెలంగాణ ఉద్యమం మొదలు పెడతాం అని వెంకటరమణారెడ్డి అన్నారు.

# సిద్దిపేటలో మరోమారు టెన్షన్ వాతావరణం


## కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట

సిద్ధిపేట,ఆగస్ట్ 20 : ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయం వద్ద ఫ్లెక్సీ వివాదం అనంతరం మరోసారి సిద్దిపేటలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఓ వైపు భారాస తమ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసుకుంది. ఈ సమావేశంలో రుణమాఫీ కాని రైతులకు పార్టీ నుంచి ఎలాంటి సహకారం అందించాలనే అంశాలపై చర్చించుకుంటున్నారు. మరోవైపు రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా పొన్నాల రహదారి వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కాన్వాయ్‌తో సిద్దిపేట చేరుకున్నారు. హరీశ్‌రావు క్యాంపు ఆఫీస్ ముందు నుంచి ర్యాలీకి మైనంపల్లి ప్రయత్నించారు. ఈ క్రమంలో బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వద్ద పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు సర్ది చెప్పడంతో మరో మార్గం ద్వారా కాంగ్రెస్ నేతలు పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇటు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం, భారాస శ్రేణల సమావేశం రెండూ ఒకేసారి కావడంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి కార్యకర్తలు, నాయకులు సిద్దిపేటకు చేరుకున్నారు. ఫ్లెక్సీ వివాదం అనంతరం ఇంత భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు ఒకచోటకు చేరుకోవడంతో పోలీసులు కూడా సిద్దిపేట పట్టణం మొత్తం మోహరించారు. ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

# తెలలంగాణలో ఆరుగురు ఐఎఎస్‌ల బదిలీ

## కొందరికి అదనపు బాధ్యతలు అప్పగింత

## జిహెచ్‌ఎంసి పూర్తి కమిషనర్‌గా ఆమ్రపాలి



హైదరాబాద్,ఆగస్ట్ 20 : తెలంగాణలో ఆరుగురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేయడంతో పాటు కొందరికి అదనపు బాధ్యతలు అప్పగించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఆమ్రపాలికి పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగించింది. హెచ్‌ఎండీఏ, మూసీ అభివృద్ధి, హెచ్‌జీసీఎల్ అదనపు బాధ్యతల నుంచి ఆమ్రపాలిని ప్రభుత్వం రిలీవ్ చేసింది. మూసీ అభివృద్ధి కార్పోరేషన్ ఎండీగా దాన కిశోర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్‌కు అదనపు బాధ్యతలు ఇవ్వగా.. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ జాయింట్ కమిషనర్‌గా కోట శ్రీవాస్తవ, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా చహత్ బాజ్‌పాయ్, హైదరాబాద్ జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి మయాంక్ మిత్తల్‌ను బదిలీ చేసింది.

## కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ది

## క్రెడాయ్ సమావేశంలో మంత్రుల స్పష్టీకరణ

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): గతంలో వైఎస్ ప్రభుత్వం చేపట్టిన పనుల వల్లే హైదరాబాద్ అభివృద్ధికి బీజం పడిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. క్రెడాయ్ నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వల్లే అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడికి వచ్చాయి. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ కోసం కందుకూరు వైపు అభివృద్ధిపై దృష్టి పెట్టాం. అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీసీసీఐతో చర్చించాం. స్థిరాస్తి వ్యాపారుల సమస్యల్ని మంత్రిమండలి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను. భారాస ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది. ఒక్కో సమస్యను తీరుస్తూ వస్తున్నాం. సోనియా ఇచ్చిన తెలంగాణను ప్రపంచంతో పోటీ పడేలా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం అని కోమటిరెడ్డి పేర్కొన్నారు. స్థిరాస్తి రంగ వ్యాపారులకు అండగా ఉంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. క్రెడాయ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడం సంతోషకరమన్నారు. రాష్ట్రాన్ని మరో స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయాల్లోకి రాకముందు వైమానిక రంగంలో పని చేశాను. హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో పోటీ పడుతుందనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. నగరానికి కృష్ణ, గోదావరి జలాలను తీసుకొచ్చిన ఘనత, మెట్రో నిర్మించిన ఘనత కాంగ్రెస్‌దేనని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.

------------

## జగన్ అక్రమాస్తుల కేసు విచారణ

## సెప్టెంబర్ 17కు వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ మరోసారి వాయిదా పడింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలన్న పిల్‌పై తెలంగాణ హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జగన్ కేసులప త్వరితగతిన విచారణ జరపాలని హరిరామ జోగయ్య పిల్ దాఖలు చేశారు. ఇప్పటికే జగన్‌తో పాటు సీబీఐకి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రజాప్రతినిధుల కేసులను త్వరితగతిన జరపాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయని పిటిషనర్ వాదించారు. ఈ క్రమంలో పిటిషన్లపై విచారణను సెప్టెంబర్ 17కు తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది.

మరోవైపు ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు విచారణ నుంచి జస్టిస్ సంజయ్ కుమార్ తప్పుకొంటున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.. జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి నమోదైన సీబీఐ కేసుల్లో తీర్పు వెలువడిన తర్వాతే ఈడీ కేసుల్లో తీర్పులు ఇవ్వాలని గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా లేదా సమాంతరంగా విచారించినా ఆ పద్ధతినే అనుసరించాలని అప్పట్లో స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును గతేడాది మే నెలలో ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆగస్టు 14న ఈడీ పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే.. కేసు ప్రారంభమైన వెంటనే తాను విచారణ నుంచి తప్పుకొంటున్నానని జస్టిస్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. వాదనలు వినిపించేందుకు ఇరుపక్షాల న్యాయవాదులు సిద్ధమవగా జస్టిస్ సంజీవ్ కుమార్ లేని ధర్మాసనం ముందు పిటిషన్‌ను లిస్ట్ చేయనున్నట్టు జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. సెప్టెంబరు 2 నుంచి మొదలయ్యే వారంలో సీజేఐ ఆదేశాల మేరకు మరో ధర్మాసనం ముందు లిస్ట్ చేయాలని ఆయన ఆదేశించారు.

# రుణామాఫీ కాలేదంటూ నిరసనలు

## ఏపీజీవీబీకి తాళం వేసి రైతు ఆందోళన

ఖమ్మం,ఆగస్ట్ 20 : తమకు రుణమాఫీ కావడం లేదని ఆవేదన చెందిన ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన రైతులు ఏపీజీవీబీకి తాళం వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఏపీజీవీబీ బ్యాంక్ పరిధిలో సుమారు 7 గ్రామాలకు చెందిన 200 మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని ఆందోళనతో మంగళవారం బ్యాంకు వద్దకు చేరుకున్నారు. తక్షణమే రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం బేషరతుగా ఎలాంటి షరతులు, కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుబంధు నగదు విడుదల చేయాలన్నారు. ఏపీజీవీబీ పరిధిలోని ఒక్క గ్రామంలో కూడా 50 శాతానికి మించి రుణమాఫీ జరగలేదని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కోసం వ్యవసాయాధికారుల కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ సాధారణ రైతులను తిప్పించుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా ఎలాంటి ఆంక్షలు లేకుండా సాగుచేసే ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# కోల్‌కతా హత్యాచార ఘటనపై సుప్రీం విచారణ

## పని ప్రదేశాల్లో భద్రతపై సిజెఐ ఆందోళన

## ఆందోళనకారులపై బలప్రయోగం సరికాదు

## విచారణకు సంబంధించి స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ,ఆగస్ట్ 20 : కోల్‌కతాలోని ప్రభుత్వ ఆర్‌జి కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో మహిళా వైద్యురాలిపై అత్యాచారం,హత్య కేసుపై సుప్రీం కోర్టు విచారణ ప్రారంభించింది. సూమోటోగా తీసుకున్న కేసును విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళలు పని ప్రదేశాల్లోనే భద్రత లేకపోయే వారికి సమానత్వం ఎక్కడ వస్తుందని ప్రశ్నించారు. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ.. కోల్‌కతా అత్యాచారం కేసును హైకోర్టు విచారిస్తోందని తెలుసు కానీ ఈ దుర్ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఓ వైద్యుల భద్రతకు సంబంధించిన అంశం కావడంతో సూమోటోగా తీసుకొని విచారిస్తున్నాం అని అన్నారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ కూడా ఆలస్యంగా దాఖలయ్యింది. ఆ ఎఫ్ఐఆర్‌లో హత్య ప్రస్తావన ఉందా?. కేసును ఆత్మహత్యగా చెబుతున్నప్పుడు ప్రిన్సిపాల్ ఏమి చేస్తున్నారనేది అతిపెద్ద ప్రశ్న' అని చీఫ్ జస్టిస్ అడిగారు. దీనిపై విచారణ చేస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ తన విచారణకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును కోర్టు ముందు ఉంచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దర్యాప్తు స్థితిని కూడా తెలియజేయాలని సూచించింది. అనంతరం కేసు విచారణమను గురువారానికి వాయిదా వేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే వ్యక్తులపై బలప్రయోగం చేయొద్దని ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. మీడియాలో విమర్శించే వ్యక్తులపై కూడా చర్యలు తీసుకోవద్దని సూచించారు. బాధితురాలి కుటుంబానికి రాత్రి 8.30 గంటలకు మృతదేహం అప్పగించారని తర్వాత 11.45 గంటలకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, అది కూడా
తండ్రి ఫిర్యాదుపైనేనని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఈ సమయంలో ఏం జరిగిందని సీజేఐ ప్రశ్నించారు. అంతేకాకుండా ఓ గుంపు వచ్చి మెడికల్ కాలేజీని ధ్వంసం చేస్తే పోలీసులు ఏం చేశారని నిలదీశారు. నేరం జరిగిన ప్రాంతానికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఈ సందర్భంగా సొలిసిటర్ జనరల్ మాట్లాడుతూ సమాచారం లేకుండా 10 వేల మంది గుమిగూడినట్టు చెప్పుకొచ్చారు. అసలు ఏంజరిగిందో గురువారం నివేదిక ఇవ్వాలని బెంగాల్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఆసుపత్రుల్లో, ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో యువ వైద్యుల దుస్థితి గురించి మాట్లాడారు. వాళ్ల పరిస్థితి ఏం బాగాలేదని అన్నారు. వారంతా ఇంటర్న్‌లు, రెసిడెంట్ డాక్టర్లు అన్నింటికంటే ముఖ్యంగా మహిళా డాక్టర్లు అని తెలుసున్నారు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్. యువ వైద్యుల్లో చాలా మంది 36 గంటల పాటు పని చేస్తున్నారని తెలుస్తోంది. అక్కడ కూడా సరైన వసతులు భద్రత లేదనేది సమాచారం. సురక్షితమైన పని పరిస్థితులు కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యల కోసం జాతీయ ప్రోటోకాల్ డెవలప్ చేయాల్సి ఉంది. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ లేకుండా వారు ఉద్యోగాలకు వెళ్లలేని దుస్థితి ఉదంటే మనం వారి సమానత్వాన్ని నిరాకరిస్తున్నామని అన్నారు. ఇది చాలా తీవ్రమైన విషయమన్నారు చీఫ్ జస్టిస్. వీటన్నింటిపై నేషనల్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి చూస్తున్నాం. సీనియర్ మరియు జూనియర్ వైద్యుల భద్రత కోసం దేశవ్యాప్తంగా అనుసరించాల్సిన విధివిధానాలను ఈ టాస్క్‌ఫోర్స్ సూచిస్తుంది. అన్నారు. దయచేసి విధులకు రండి... దేశ ప్రజల తరఫున వైద్యులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి విజ్ఞప్తి చేశారు. 'మీ భద్రతపై దేశం మొత్తం ఆందోళన చెందుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న వైద్యులకు ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాం. మమ్మల్ని నమ్మండి. రోగులు నష్టపోతున్నారు. కచ్చితంగా మీ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. సేవలు రద్దు చేయడం సరికాదు. మీరు విధుల్లోకి రండి' అని సీజేఐ విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆ పాపకు జీవితకాలం ఉచిత బస్ పాస్

## ఆర్టీసీ ఎండి సజ్జన్నార్ అందచేత

హైదరాబాద్,ఆగస్ట్ 20 : రాఖీ పౌర్ణమి రోజు ఆర్టీసీ బస్సులో జన్మించిన చిన్నారికి జీవిత కాలంపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించేలా బస్ పాస్ ను అందిస్తున్నట్లు ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. ఆర్టీసీ బస్సులు, బస్ స్టేషన్ లలో పుట్టిన పిల్లలకు జీవిత కాలపు ఉచిత బస్ పాస్ ను ఇవ్వాలని గతంలో యాజమాన్యం నిర్ణయంతీసుకుంది. ఈ మేరకు ఈ ఆడపిల్లకు బర్త్ డే గిఫ్ట్ గా లైఫ్ టైం ఫ్రీ బస్ పాస్‌ను మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. అలాగే, కండక్టర్‌తో పాటు గర్భిణి డెలివరీకి సాయం చేసిన వనపర్తిలోని మదర్ అండ్ చైల్డ్ గవర్నమెంట్ హాస్పటల్ స్టాఫ్ నర్స్ అలివేలు మంగమ్మకు డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లోనూ ఏడాది పాటు ఉచితంగా ప్రయాణించే బస్ పాస్‌ను ఆర్టీసీ అందించింది. బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి కాన్పు చేసిన గద్వాల్ డిపోనకు చెందిన కండక్టర్ భారతి, డ్రైవర్ అంజిలతో పాటు నర్సు అలివేలు మంగమ్మను మంగళవారం టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. హైదరాబాద్ బస్ భవన్ లో సంస్థ ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ వారిని ఘనంగా సన్మానించి.. నగదు బహుమతులు అందజేశారు. అనంతరం, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో ఏడాది పాటు ఉచితంగా ప్రయాణించే బస్ పాస్‌ను నర్సు అలివేలు మంగమ్మకు, చిన్నారి ఉచిత బస్ పాస్‌ను గద్వాల డిపో మేనేజర్ మురళీకృష్ణకు అందజేశారు.

# కవిత బెయిల్‌పై 27న విచారణ

## 22న సమాధానం ఇస్తామన్న ఇడి

న్యూఢిల్లీ,ఆగస్ట్ 20 : ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 22లోగా సమాధానం ఇస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ మంగళవార సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ కేసులో ఇప్పటికే సీబీఐ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసిందంటూ ఈడీ, సీబీఐ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు.. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనానికి తెలిపారు. ఈడీ కౌంటర్ అఫిడవిట్ సిద్ధమవుతోందని, 22లోగా దాఖలు చేస్తామని రాజు తెలిపారు. ఈ మేరకు కేసు విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది. ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ ఢిల్లీ హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన పిటిషన్లపై ఈ నెల 12న సుప్రీంకోర్టు కేంద్ర దర్యాప్తు సంస్థల సమాధానం కోరింది. మద్యం పాలసీ కేసులో సీబీఐ, ఈడీ వేర్వేరుగా కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. మార్చి 15న హైదరాబాద్‌లో కవితను ఈడీ అరెస్టు చేసింది. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీపై తిహార్ జైలులో ఉన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం 21 ఆగస్టు 2024





# ఐపీఎల్‌తో రూ.5,210 కోట్లు

## గతేడాది బీసీసీఐ లాభం ఇది 2022తో పోలిస్తే 116 శాతం పెరుగుదల

ముంబై: ప్రపంచ క్రికెట్‌లో అత్యంత సంపన్న బోర్డుగా కొనసాగుతున్న భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) ఖజానా.. ఐపీఎల్‌తో మరింత కళకళలాడుతోంది. ఇతర దేశాల బోర్డులకు కన్ను కుట్టే రీతిలో 2023 సీజన్‌కుగాను బీసీసీఐకి ఏకంగా రూ. 5,210 కోట్ల లాభాన్ని ఐపీఎల్ అందించింది. ఇది పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వార్షిక ఆదాయంకన్నా ఎన్నో రెట్లు ఎక్కువ కావడం విశేషం. అలాగే 2022 సీజన్‌తో పోలిస్తే ఈసారి 116 శాతం పెరుగుదల కనిపించిందని బోర్డు తమ వార్షిక నివేదికలో పేర్కొంది. దీనిప్రకారం ఐపీఎల్ 2023 సీజన్‌లో మె-ంత్తంగా రూ. 11,769 కోట్ల ఆదాయం రాగా.. 2022తో పోలిస్తే ఇది 78శాతం అధికం కావడం విశేషం. మ-రోవైపు ఖర్చులు కూడా 68 శాతం పెరుగుదలతో రూ. 6,648 కోట్లకు చేరాయి. ఇక, 2023-27 కాలానికి బోర్డు రూ. 48,390 కోట్లతో మీడియా హక్కుల ఒప్పందం కుదుర్చుకోవడం కూడా ఈ అధిక లాభాలకు కారణంగా చెప్పవచ్చు. ఇందులో డిస్నీ స్టార్ గ్రూప్ రూ. 23,575 కోట్లతో టీవీ రైట్స్ తీసుకోగా, జియో సినిమా రూ. 23,758 కోట్లతో డిజిటల్ హక్కులను కొనుగోలు చేసింది.




అలాగే ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను టాటా సన్స్ రూ. 2500 కోట్లకు తీసుకోవడం గమనార్హం. గతేడాది ఆరంభమైన మహిళల ప్రీమియర్ లీగ్ కూడా బీసీసీఐకి రూ. 377 కోట్ల మిగులు సంపాదనను తీసుకువచ్చింది. ఇలా, లీగ్‌లతో బీసీసీఐ తన ఆదాయాన్ని రోజురోజుకూ పెంచుకుంటూ ముందుకెళు తోంది.

**నెలాఖరులోగా రిటెన్షన్ రూల్‌పై స్పష్టత**

వచ్చే ఏడాది ఐపీఎల్ మెగా వేలం జరుగబోతోంది. దీనికంటే ముందే ఫ్రాంచైజీలన్నీ ఆటగాళ్ల రిటెన్షన్ పాలసీ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాయి. ఈనెలాఖరులోగా బీసీసీఐ ఈ విషయంలో స్పష్టతనిచ్చే అవకాశం ఉందని సమాచారం. అయితే లీగ్‌లోని ప్రతీ జట్టు రైట్ టు మ్యాచ్ ఆప్షన్‌తో కలిపి ఆరుగురిని అట్టిపెట్టుకునేందుకు అనుమతించే ఆలోచనలో ఉంది. వేలానికి ముందే ఆయా జట్లు తమ ఆటగాళ్లను మార్చుకోవడాన్ని రైట్ టు మ్యాచ్ అని పిలుస్తుంటారు. కొన్ని ఫ్రాంచైజీలు అసలు మెగా వేలమే వద్దని బోర్డును కోరినట్టు తెలుస్తోంది. అయితే ఇందుకు బీసీసీఐ మాత్రం సుముఖంగా లేదు.

## రోహిత్ శర్మ అన్నీ మరిచిపోతాడు




టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు చాలా మతిమరుపు. అతను వస్తువులను ఒక దగ్గర పెడుతాడు.. వాటిని మరచిపోతాడు. చాలా సార్లు టాస్ సమయంలో కూడా ముందుగా బౌలింగ్ ఎంచుకోవాలా లేదా బ్యాటింగ్ ఎంచుకోవాలా అని మర్చిపోతాడు. అయితే 'హిట్ మ్యాన్ 'గా పేరుగాంచిన రోహిత్ గేమ్ ప్లాన్ ను మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ మరిచిపోడు. ఈ రహస్యాన్ని టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ బయటపెట్టాడు. రోహిత్ శర్మపై రాథోడ్ ప్రశంసలు కురిపిస్తూ.. గ్రౌండ్?లో అతని వ్యూహం, కెప్టెన్సీ శైలి అద్భుతమని కొనియాడాడు. తరువర్ కోహ్లి పోడ్‌కాస్ట్‌లో రాథోడ్ మాట్లాడుతూ, "జట్టు సమావేశాలు లేదా వ్యూహాలపై ఇంత ఆసక్తిని ఏ కెప్టెన్ లో చూడలేదు. అతను టాస్ సమయంలో బ్యాటింగ్ చేయాలా లేదా బౌలింగ్ చేయాలా నిర్ణయించుకున్న విషయాన్ని మర్చిపోవచ్చు. అతను తన ఫోన్, ఐప్యాడ్‌ను మరచిపోవచ్చు. కానీ తన గేమ్ ప్లాన్‌ను ఎప్పటికీ మర్చిపోడు. అతను చాలా తెలివైనవాడు. చాలా తెలివైన వ్యూహకర్త." అని పేర్కొన్నడు. రోహిత్ శర్మ జట్టు వ్యూహంపై ఎక్కువ సమయం కేటాయిస్తాడు. అంతేకాకుండా బౌలర్లు, బ్యాట్స్‌మెన్‌లతో సమావేశాలకు హాజరవుతాడు. బౌలర్లు, బ్యాట్స్‌మెన్‌లతో కూర్చుని వారు ఏమి ఆలోచిస్తున్నారో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఆటగాళ్లతో చాలా స్నేహపూర్వకంగా ఉంటాడు.. వారితో టైం స్పెండ్ చేస్తాడు." అని రోహిత్ శర్మ గురించి రాథోడ్ చెప్పాడు. అతను బ్యాట్స్‌మెన్‌గా అద్భుతమైన ఆటగాడు కావడమే రోహిత్‌లోని మొదటి గుణం. అతను తన ఆటను బాగా అర్థం చేసుకుంటాడని తాను భావిస్తున్నానని.. అతను ఎప్పుడూ స్పష్టమైన గేమ్ ప్లాన్ కలిగి ఉంటాడని రాథోడ్ పేర్కొన్నాడు. ఇంకా మాట్లాడుతూ, "నాయకుడిగా కూడా ముందు నుండి నాయకత్వం వహించాలి. మిగతా ఆటగాళ్లకు ఇన్స్పిరేషన్ గా ఉండాలంటే మీరు ప్రదర్శన ఇవ్వాలి. రోహిత్ కెప్టెన్ అయినప్పటి నుండి అతను ఎప్పుడూ జట్టును ఆదర్శంగానే నడిపించాడు. ఆటగాళ్లతో రోహిత్ చాలా కనెక్ట్ అయ్యాడు." అని రాథోడ్ చెప్పాడు. కాగా.. రాథోడ్ పదవీకాలం టీ20 ప్రపంచ కప్ 2024తో ముగిసింది.

## తనకు ధోనీ చాలా భద్రత కల్పించాడు

మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల కెప్టెన్సీపై భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు. ఈ ముగ్గురు ఆటగాళ్లు జట్టుపై ప్రభావం చూపి ఆటగాళ్లను ఎలా తయారో చేశారో చెప్పాడు. ముగ్గురు కెప్టెన్ల నాయకత్వంలో ఆడిన అతికొద్ది మంది ఆటగాళ్లలో బుమ్రా కూడా ఉన్నాడు. ధోనీ కెప్టెన్సీలో అరంగేట్రం చేసిన బుమ్రా.. కోహ్లీ కెప్టెన్సీలో తనను తాను మెరుగుపరుచుకున్నాడు. అటు.. రోహిత్ నాయకత్వంలో స్వేచ్ఛగా ఆడే స్వేచ్ఛ లభించింది. రోహిత్ కెప్టెన్సీలో బుమ్రా ముంబై ఇండియన్స్‌కు కూడా ఆడిన సంగతి తెలిసిందే. 2011 ప్రపంచ కప్‌తో సహా అనేక చిరస్మరణీయ విజయాలను భారత్‌కు అందించిన ధోనీ కెప్టెన్సీలో బుమ్రా తన అనుభవాలను కూడా పంచుకున్నాడు. తనకు ధోనీ చాలా భద్రత కల్పించాడని తెలిపాడు. అతను తన ప్రవృత్తిపై గొప్ప విశ్వాసాన్ని కలిగి ఉంటాడన్నాడు. ఓవర్ ప్లానింగ్‌ను నమ్మడని చెప్పాడు. ఆ నమ్మకమే అతనిని అంతర్జాతీయ స్థాయిలో రాణించిందని బుమ్రా పేర్కొన్నాడు. ఆటగాళ్లతో భావోద్వేగ స్థాయిలో కనెక్ట్ అవుతాడని.. వారి ఆలోచలను అర్థం చేసుకుంటాడని రోహిత్‌ను ప్రశంసించాడు. రోహిత్ కెప్టెన్సీ గురించి బుమ్రా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బ్యాట్స్‌మెన్ అయినప్పటికీ బౌలర్ల పట్ల సానుభూతి చూపే




అతికొద్ది మంది కెప్టెన్లలో రోహిత్ ఒకడని అన్నాడు. రోహిత్ రిజిడ్ కాదు, రియాక్ట్ అయ్యేందుకు సిద్ధంగా ఉంటాడని తెలిపాడు. కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్న తర్వాత కూడా జట్టు ఫిట్‌నెస్ ప్రమాణాలను మార్చడానికి.. తన నాయకత్వ ఉనికిని కొనసాగిస్తునందుకు కోహ్లీని బుమ్రా కొనియాడాడు. విరాట్ శక్తివంతంగా, ఉద్వేగభరితంగా, దూకుడుగా ఉంటాడని బుమ్రా చెప్పాడు. కోహ్లీ ఇప్పుడు కెప్టెన్ కాదు కానీ.. ఇప్పటికీ నాయకుడిగా కొనసాగుతున్నాడని బుమ్రా తెలిపాడు. బుమ్రా భారత టెస్ట్, టీ20 జట్లకు కూడా కెప్టెన్‌గా వ్యవహరించాడు. బౌలర్‌లకు ప్రత్యేకమైన నాయకత్వ సామర్థ్యాలు ఉన్నాయని తన నమ్మకాన్ని వ్యక్తం చేశాడు. తన కెప్టెన్సీ గురించి బుమ్రా మాట్లాడుతూ.. 'బౌలర్లు తెలివైనవారని నేను భావిస్తున్నాను. ఎందుకంటే వారు బ్యాట్స్‌మెన్‌లను అవుట్ చేస్తారు. మనం మ్యాచ్‌లు ఓడిపోయినప్పుడు సాధారణంగా బ్యాట్స్‌మెన్‌పై నిందలు వేస్తారు. కాబట్టి ఇది కష్టమైన పని. కపిల్ దేవ్, ఇమ్రాన్ ఖాన్, వసీం అక్రమ్ మరియు వకార్ యూనిస్ వంటి కెప్టెన్లు కూడా బౌలర్లేనని తెలిపాడు. కపిల్ దేవ్ భారత్ కు ప్రపంచకప్ అందించాడు అని అన్నాడు. ఇమ్రాన్ ఖాన్ పాకిస్థాన్‌కు ప్రపంచకప్ అందించాడు. అందుకే బౌలర్లు తెలివైనవారని జస్ప్రీత్ బుమ్రా చెప్పాడు.

## ఒకే ఓవర్‌లో 39 పరుగులు..

### డేరియస్ విస్సెర్ ప్రపంచ రికార్డు

మోవా బ్యాటర్ డేరియస్ విస్సెర్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఒకే ఓవర్‌లో అత్యధిక పరుగులు రాబట్టిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈస్ట్ ఆసియా-పసిఫిక్ సబ్ రీజనల్‌లో భాగంగా సమోవా, వనువాటు దేశాల మధ్య జరిగిన మ్యాచ్‌లో విస్సెర్ ఒకే ఓవర్‌లో 39 రన్స్ చేశాడు. సమోవా ఇన్నింగ్స్‌లోని 15వ ఓవర్‌ను వనువాటు బౌలర్ నిలిన్ నిపికో వేయగా.. విస్సెర్ ఏకంగా 39 పరుగులు పిండుకున్నాడు. గతంలో ఈ రికార్డు 38 పరుగులుగా ఉంది. ఓవరాల్ టీ20లో ఒక ఓవర్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా డేరియస్ విస్సెర్ నిలిచాడు. అంతకుముందు ఈ రికార్డు 38 పరుగులు. 24 జూలై 2012న ససెక్స్, గ్లౌసెస్టర్‌షైర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్ నమోదైంది. అయితే అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒక ఓవర్‌లో అత్యధికంగా నమోదైన పరుగులు మాత్రం 36. యువరాజ్ సింగ్ (2007), కీరన్ పొలార్డ్ (2021), నికోలస్ పూరన్ (2024), దీపేంద్ర సింగ్ (2024) మాత్రమే 36 పరుగులు చేశారు. యువరాజ్, పొలార్డ్ మాత్రమే వరుసగా ఆరు సిక్స్‌లు బాదేశారు. డేరియస్ విస్సెర్ ఆరు సిక్సుల వీరుల జాబితాలో కూడా చేరాడు. అయితే వరుసగా మాత్రం కొట్టలేదు. వనువాటు బౌలర్ నిలిన్ నిపికో అదనంగా మూడు నో బాల్స్ వేయడంతో.. విస్సెర్ ఒకే ఓవర్‌లో (6, 6, 6, నోబాల్, 6, 0, నో బాల్, నో బాల్6, 6 ) ఆరు సిక్సులు బాదాడు. ఇక సమోవా తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో సెంచరీ (132 పరుగులుబీ 62 బంతుల్లో 14 సిక్స్‌లు, 5 ఫోర్లు) సాధించిన తొలి ఆటగాడిగా విస్సెర్ రికార్డు సృష్టించాడు.

## విధ్వంసకర శతకంతో విరుచుకుపడిన కరుణ్ నాయర్

మహారాజా ట్రోఫీ కేఎస్‌సీఏ టీ20 టోర్నీలో భాగంగా మంగళూరు డ్రాగన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మైసూర్ వారియర్స్ కెప్టెన్, టీమిండియా ట్రిపుల్ సెంచరీ హీరో కరుణ్ నాయర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఈ మ్యాచ్‌లో కరుణ్ విధ్వంసకర శతకంతో విరుచుకుపడ్డాడు. కరుణ్ తన శతకాన్ని కేవలం 43 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో పూర్తి చేశాడు. ఈ మ్యాచ్‌లో ఓవరాల్‌గా 48 బంతులు ఎదుర్కొన్న కరుణ్.. 13 ఫోర్లు, 9 సిక్సర్ల సాయంతో 124 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఫలితంగా తొలుత బ్యాటింగ్ చేసిన మైసూర్ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 226 పరుగుల భారీ స్కోర్ చేసింది. వారియర్స్ ఇన్నింగ్స్‌లో కరుణ్ మినహా ఎవరూ పెద్దగా రాణించలేదు.

టీమిండియా మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ తనయుడు సమిత్ ద్రవిడ్ 16, అజిత్ కార్తీక్ 11, కార్తీక్ 23, సుమిత్ కుమార్ 15 పరుగులు చేశారు. అఖర్లో బ్యాటింగ్‌కు దిగిన మనోజ్ భాంగడే 14 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 31 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. డ్రాగన్స్ బౌలర్లలో అభిలాష్ షెట్టి 2 వికెట్లు పడగొట్టగా.. నిశ్చిత్ రావు, దర్శన్ తలో వికెట్ దక్కించుకున్నారు. వారియర్స్ ఇన్నింగ్స్ అనంతరం వర్షం మొదలు కావడంతో వీజేడీ పద్ధతిన డ్రాగన్స్ లక్ష్యాన్ని 14 ఓవర్లలో 166 పరుగులుగా నిర్ధారించారు.14 ఓవర్లలో 166 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన డ్రాగన్స్ ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేకపోయింది. ఆ జట్టు ఆటగాళ్లలో నికిన్ జోస్ (32), కృష్ణమూర్తి సిద్ధార్థ్ (50), రోహన్ పాటిల్ (12), దర్శన్ (12) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు. ఫలితంగా ఆ జట్టు 14 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 138 పరుగులు మాత్రమే చేయగలిగింది. అజిత్ కార్తీక్, జగదీశ సుచిత్ తలో రెండు వికెట్లు తీసి డ్రాగన్స్‌ను దెబ్బకొట్టారు.



# ప్రభాస్‌తో సినిమాతో స్టార్ స్టేటస్

## ఇప్పుడంతా ఇమ్మాన్వీ ఇస్మాయిల్ కోసం సర్చ్

ప్రభాస్ పక్కన కథానాయికగా కొత్తమ్మాయి అనగానే, సోషల్‌మీడియా ఫోకస్ అంతా ప్రస్తుతం ఇమాన్వీ ఇస్మాయిల్ పైనే. అసలు ఈ అమ్మాయి ఎవరు.. ఎక్కడ్నుంచొచ్చింది? అంటూ ఆరాలు మొదలయ్యాయి. ప్రభాస్ పుణ్యమా అని రాత్రికి రాత్రి ఈ అమ్మాయి స్టేటస్ మారిపోయింది. తన ఇన్‌స్టాలో ఏకంగా లక్షమంది ఫాలోవర్లు ఒక్కరోజులో పెరిగిపోయారు. శంఖంలో పోస్తేనే కదా తీర్థం అన్నట్టు, ప్రభాస్ పక్కన హీరోయిన్ అనగానే స్టార్ అయి కూర్చుంది ఇమాన్వీ. బడా నిర్మాతలంతా ప్రభాస్ సినిమా తర్వాత తమ సినిమాల్లో ఈ అమ్మాయిని నటింపజేయడానికి అప్పడే ప్రయత్నాలు ముమ్మరం చేశారట. అయితే.. మైత్రీ మూవీమేకర్స్ వాళ్లు మాత్రం తమ సంస్థలో ముందు మూడు సినిమాలు చేసేంతవరకూ ఇతర సినిమాలు ఒప్పకో కూడదని కండీషన్ పెట్టారట ఈ ముద్దుగుమ్మకు. అంతేకాదు, దర్శకుడు అను రాఘవపూడి కూడా తన సినిమా పూర్తయ్యేంత వరకూ మరో సినిమా చేయడానికి వీల్లేదని షరతు విధించారట. ప్రభాస్‌తో ఆయన చేసే సినిమాకు కథానాయిక ఎవరైనా సరే, బల్క్ డేట్లు తనకు అవసరమట. పిలిచినప్పడల్లా సెట్‌కి రావాల్సి ఉంటుందట. అందుకే బిజీ కథానాయికలను పక్కనపెట్టి ఇమాన్వీని తీసుకున్నారట అను రాఘవపూడి. ఏదేమైనా ఈ అందాలభామ రొట్టె విరిగి నేతిలో పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# ఓజిలో భాగస్వామ్యం కావడం అదృష్టం

హీరోయిన్ ప్రియాంక అరుల్ మోహన్ ప్రముఖ కథానాయకుడు పవన్ కల్యాణ్ నటిస్తోన్న చిత్రం 'ఓజీ' ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ సుజీత్ దర్శకత్వంలో రానుంది. ఇందులో పవన్ సరసన ప్రియాంక అరుల్ మోహన్ కనిపించనున్నారు. తాజాగా 'సరిపోదా శనివారం' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రియాంక మాట్లాడుతూ 'ఓజీ' అవకాశం గురించి పంచుకున్నారు. 'ఓజీ లాంటి గొప్ప కథలో భాగం కావడం, వపన్ సర్ పక్కన నటించడం నా అదృష్టం. ఆ అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు ధన్యవాదాలు. పవన్ కల్యాణ్, నాని ఇద్దరూ క్రియేటివ్‌గా ఉంటారు. నాని సినిమాల గురించి ఎప్పడూ కలలు కంటారు. పవన్ ఎప్పడూ ప్రజల గురించి ఆలోచిస్తుంటారు' అని ప్రియాంక చెప్పారు. పవన్ కల్యాణ్ ప్రజల్లోకి వెళ్లడం కోసమే సినిమాల్లోకి వచ్చారేమో అనిపిస్తుంటుందని హీరో నాని అన్నారు. ఇక తాజాగా 'ఓజీ' గురించి హరీశ్ శంకర్ కూడా మాట్లాడారు. 'ఓజీ' టీజర్ చూసి ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. దానికి తమన్ అందించిన సంగీతం మరో స్థాయి-ఎలో ఉందని ప్రశంసించారు. ఈ చిత్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. వీళ్లిద్దరూ 'ఓజీ' గురించి చెప్పడంతో ఎక్స్‌లో ఈ హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్ అవుతోంది. ఈ సినిమా విషయానికొస్తే.. ముంబయి - జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతోంది. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. అర్జున్ దాస్, వెంకట్, శ్రియారెడ్డి తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. దీని గ్లింప్స్‌కు భారీ స్పందన వచ్చిన విషయం తెలిసిందే.

# అనసూయ.. సింపుల్ లుక్ లో ఎంత అంధమో..

టాలీవుడ్ నటి అనసూయకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. కామెడీ షో జబర్దస్త్ తో వేరే లెవెల్ పాపులారిటీ దక్కించుకున్న అమ్మడు.. తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేసుకుంది. బుల్లితెర అందాల యాంకర్ గా పేరు సంపాదించుకుంది. అయితే హెూస్ట్ గా కెరీర్ పీక్స్ లో ఉన్న సమయంలో సడెన్ గా స్మాల్ స్ర్కీన్ కు గుడ్ బై చెప్పేసింది. సినిమాల్లో వరుస ఆఫర్లు అందుకుంటూ దూసుకుపోతోంది. ఇప్పటికే పలు సినిమాలతో అలరించిన అనసూయ.. త్వరలో మరిన్ని చిత్రాలతో సందడి చేయనుంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వస్తున్న పుష్ప -2 లో కీలక పాత్ర పోషిస్తోంది. అయితే సినిమాలు చేస్తూనే.. పలు షోస్ లో కూడా పాల్గొంటోంది అమ్మడు. అందుకు స్పెషల్ గా రెడీ అయ్యి అట్రాక్ట్ చేస్తోంది. రీసెంట్ గా ఓ ఛానల్ లో స్టార్ట్ అయిన షో కోసం వీక్లీ వన్స్ వెరైటీగా రెడీ అవుతూ ఆకట్టుకుంటోంది. అయితే సోషల్ మీడియాలో ఆమె ఫోటోస్ కు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉన్న విషయం తెలిసిందే. నాలుగు పదుల వయసులో నాజూగ్గా కనిపిస్తూ తన గ్లామర్ తో భారీగా ఫాలోవర్స్ ను పెంచుకుంటోంది. ఎప్పటికప్పుడు అందాల ఆరబోతతో కుర్రాళ్లను మైమరిపిస్తుంటోంది. మోడ్రన్ ఔట్ ఫిట్స్, చీరల్లో వేరే లెవల్ లో గ్లామర్ షో చేస్తుంటోంది అమ్మడు. తన చూపు, నవ్వుతో అందర్నీ మాయ చేస్తుంటోంది. తాజాగా వైట్ చూడీదార్ లో దిగిన పిక్స్ ను షేర్ చేసింది అనసూయ. చిన్న కుంకుమ బొట్టు పెట్టుకున్న బ్యూటీ.. క్యూట్ గా కనిపిస్తుంది. “నిదురిక రాదు అన్న నిజముని మోసుకుంటు మది నిను చేరుతుంది చిలకా తనకొక తోడు లాగ వెనకనె సాగుతోంది హృదయము రాసుకున్న లేఖా” అంటూ అదిరిపోయే క్యాప్షన్ ఇచ్చింది. సింపుల్ మేకప్ వేసుకున్న అమ్మడు.. రకరకాల పోజులు ఇచ్చింది. ప్రస్తుతం అనసూయ లేటెస్ట్ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మేడమ్ సర్ మేడమ్ అంతే అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. లైకుల వర్షం కురిపిస్తూ కామెంట్ సెక్షన్ నింపేస్తున్నారు. చాలా అందంగా ఉన్నారని చెబుతున్నారు. చూపు తిప్పుకోనివ్వని అందం అనసూయ సొంతమని కొనియాడుతున్నారు. అన్నిట్లో అనసూయకు నో పోటీ.. నో సాటి అని సందడి చేస్తున్నారు. మరి అమ్మడి కొత్త పిక్స్ మీరు చూశారా?



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986